

భీమవరం ఉష్ణోగ్రతలు

గరిష్ఠం : 30.0 కనిష్ఠం : 25.0

తేమ : 30.0 - 26.0



రీ సర్వేతో తిప్పలెన్నో

- సర్వే నెంబర్లకు బదులుగా ఎల్‌పీఎంలు
- మార్కెట్‌లు విలువను నిర్ధారించకపోవడంతో ఇబ్బందులు
- రిజిస్ట్రేషన్లు బంద్
- ఎల్‌పీఎం నంబర్లపై దృష్టి పెట్టిన కూటమి ప్రభుత్వం
- సర్వే నంబర్ల ఆధారంగా మార్కెట్ విలువ నిర్ధారణ
- త్వరలోనే అమల్లోకి.. • తొలగిపోనున్న రిజిస్ట్రేషన్ ఇబ్బందులు



వైసీపీ హయాంలో జగనన్న భూసురక్ష పేరుతో చేసిన హడావుడి అంతా ఇంతా కాదు. రీసర్వే పూర్తి చేయాలంటూ సమీక్షలు నిర్వహించారు. సమావేశాలు ఏర్పాటు చేశారు. శిక్షణలు ఇచ్చారు. ప్రతి పల్లె, పట్టణంలోనూ డ్రోన్‌లు తిప్పారు. ఛాయా చిత్రాలు తీశారు. చిత్ర విచిత్ర విన్యాసాలు చేశారు. సరిహద్దు రాళ్లపై జగన్‌బొమ్మలు వేశారు. పాస్ పుస్తకాలపైనా జగన్ బొమ్మలను ముద్రించి రైతులకు అందజేశారు. ప్రతి సర్వే నెంబర్ ఉన్న చోట ఎల్‌పీఎం నెంబర్ ఇచ్చారు. అక్కడే రైతులు, స్థల యజమానులకు చిక్కులు ఎదురయ్యాయి. భూములు అమ్ముకుందామంటే పనికిరాకుండా పోయాయి. ఎల్‌పీఎం నెంబర్ ఉన్న భూములను రిజిస్ట్రేషన్ చేయడం లేదు. ఎల్‌పీఎం నెంబర్‌లు ఆధారంగా మార్కెట్ విలువ కానరాలేదు. వాటికి మార్కెట్ విలువను నిర్ధారించలేదు. గతంలో సర్వే నెంబర్‌లు ఉన్న ధరల ఆధారంగానే ఎల్‌పీఎం నెంబర్‌కు కూడా అవే ధరలను నిర్ధారించాలి. దీనిపై గత ప్రభుత్వం దృష్టి పెట్టలేదు. ఫలితంగా రిజిస్ట్రేషన్‌లు నిలచిపోయాయి. రీసర్వేలో ఇలాంటి తప్పిదాలకు గత ప్రభుత్వం పాల్పడింది.

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

గత ప్రభుత్వంలో రీసర్వేతోపాటు ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను తీసుకొచ్చింది. ఇవన్నీ రైతులను భయాందోళనలకు గురిచేశాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే గత ప్రభుత్వంలో చేసిన తప్పిదాలను సరిదిద్దే పనిలో నిమగ్న మయ్యారు. అందులో భాగంగానే ఎల్‌పీఎం నెంబర్‌లు ఉన్న భూములకు మార్కెట్ విలువను నిర్ధారించారు. . రిజిస్ట్రేషన్ శాఖ ఆ దిశగా చర్యలు తీసుకుంది. జిల్లా జాయింట్ కలెక్టర్ ఆమోదం తెలిపారు. ఎల్‌పీఎం నెంబర్‌ల ఆధారంగా భూముల ధరలు నిర్ధారణ కానున్నాయి, రిజిస్ట్రేషన్ శాఖలో ఇప్పుడా పని చివరి దశకు చేరుకుంది. త్వరలోనే ఎల్‌పీఎం నెంబర్‌లు కార్యరూపం దాల్చనున్నాయి. రిజిస్ట్రేషన్‌లకు అవకాశం ఉంటుంది. ఇకపై ఎల్‌పీఎం నెంబర్‌లతోనే రిజిస్ట్రేషన్‌లు నిర్వహిస్తారు. నెంబర్ కొట్టగానే భూమి ధర కనిపిస్తుంది. ఆ మేరకు స్టాంప్ డ్యూటీ వ సూలు చేస్తారు. రిజిస్ట్రేషన్‌లకు ఎటువంటి ఢోకా ఉండదు.

రీ సర్వే నిలుపుదలతో ఊరట

కూటమి ప్రభుత్వం రీసర్వేను నిలిపివేసింది. గతంలో తప్పులు దొర్లడంతో సరిదిద్దే పనిలో నిమగ్నమైంది. రైతులకు, స్థల యజమానులకు ఇబ్బందులు లేని విధంగా తప్పులను సరిదిద్దుతున్నారు. ఉమ్మడి ఆస్తులను అడంగళ్‌లో వారసుల పేరుతో నమోదు చేస్తున్నారు. మరోవైపు ప్రభుత్వం కూడా వారసుల పేరుతో రాసేందుకు తగిన మార్గదర్శకాలను రూపొందిస్తోంది. ప్రభుత్వ మార్గదర్శకాలు విడుదలైతే ఉమ్మడి అస్తులకు సంబంధించి అడంగళ్‌లో వారసుల పేరుతో భూములు నమోదు కానున్నాయి. గత తప్పిదాలను సరిదిద్దినట్టయితే రీసర్వే తిరిగి ప్రారంభించేలా ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. మున్ముందు తప్పులు పునరావృతం కావని విశ్వసిస్తోంది. సర్వేశాఖ తప్పులను సరిదిద్దే కార్యక్రమంలో తలమునకలై ఉంది. అప్పటిదాకా రీసర్వే ప్రారంభించే అవకాశం లేదు. దాంతో రైతులు కాస్త ఊరట పొందారు. నాలుగోవిడతలో సర్వే చేసిన భూములకు ఎల్‌పీఎం నెంబర్‌ల ఆధారంగా భూములను నిర్ధారించకపోవడంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. ఇప్పుడు వాటిని కూడా నిర్ధారించారు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ధరలను నమోదు చేస్తున్నారు.

భూముల తగ్గుదల సరి అయ్యేనా

రీసర్వేలో భూముల విస్తీర్ణం తగ్గిపోయింది. రైతులకు ఇబ్బందులు ఎదురయ్యాయి. తీవ్రంగా నష్టపోయారు. సరిహద్దు వివాదాలు తలెత్తాయి. వాటిని కూడా ఇప్పుడు సరిదిద్దాలంటూ రైతులు డిమాండ్ చేస్తున్నారు. వివాదాలు తలెత్తిన చోట మళ్లీ రీ సర్వే చేయాలన్న వాదన వినిపిస్తోంది. మొత్తంపైన కూటమి ప్రభుత్వం తప్పులు సరిదిద్దేందుకు ఆదేశాలు జారీచేసింది.



రేవు పాటకు ఎదురుచూపు

- రూ.2.97 కోట్లతో జిల్లా అధికారులకు ప్రతిపాదనలు
- పాట నిర్వహణకు ఇంకా రాని అనుమతి

నరసాపురం రూరల్, ఆగస్టు 8: మాధవాయిపాలెం రేవు పాట నోటిఫికేషన్‌పై ఇంకా సస్పెన్స్ కొనసాగుతున్నది. ఇప్పటికే రూ.3.61 కోట్లతో మూడు సార్లు నోటిఫికేషన్ ఇచ్చారు. అయితే పాటదారులెవ్వరూ ముందుకు రాలేదు. దీంతో పాట ప్రారంభ ధరను రూ. 2.97 కోట్లకు తగ్గిస్తూ ఈ నెల 1న జేపీసీ సమావేశం ఏర్పాటు చేసి తీర్మానించింది. దీనికి నోటిఫికేషన్ ఇచ్చేందుకు ప్రతిపాదనలు జిల్లా ఆధికారులకు నివేదించారు. అయితే ఇంత వరకు అనుమతి రాలేదు. దీంతో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రేవు నిర్వహణ నోటిఫికేషన్ ఎప్పుడు జారీ చేస్తారన్నది ఆసక్తికరంగా మారింది. ప్రస్తుతం రేవును మండల పరిషత్ నిర్వహిస్తున్నది. ఇందుకు గ్రామ సచివాలయ సిబ్బందిని నియమిస్తుండటంతో ప్రభుత్వ శాఖల్లో పనులు ముందుకు సాగడం లేదు. రోజుకు ఒక్కొక్క పంచాయతీ నుంచి కార్యదర్శులు, దిగువ స్థాయి సిబ్బందిని షిఫ్టల వారీగా విధులకు పంపుతున్నారు. దీని వల్ల గ్రామాల్లో అత్యవసర పనులు పెండింగ్ పడుతున్నాయి. దీంతో త్వరగా నోటిఫికేషన్ జారీ చేసి పాటదారుడికి రేవు నిర్వహణ బాధ్యతల్ని అప్పగించాలని మండల పరిషత్ ఎదురుచూస్తున్నది. అయితే దీనికి సంబంధించిన ఆమోదం మాత్రం రాలేదు. జిల్లా అధికారులు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వగానే నోటిఫికేషన్ జారీ చేస్తామని ఇన్‌చార్జి ఎంపీడీవో వీరభద్రరావు తెలిపారు. మరోవైపు ఎంపీడీవో వెంకటరమణ ఆత్మహత్య సంఘటనతో రేవు వ్యవహారాల్లో ఆధికారులు ఆచితూచి వ్యవహరిస్తున్నారు. ఈసారైనా సమర్థవంతంగా పాట నిర్వహించాలని లక్ష్యంతో ఉన్నారు.

సూర్యఘర్ వెలుగులు

- జిల్లాలో విశేష స్పందన
- ఉమ్మడి జిల్లాలో 480 దరఖాస్తులు

భీమవరం టౌన్, ఆగస్టు 8 : ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకం కింద సోలార్ విద్యుత్‌ను అందించేందుకు తీసుకు వచ్చిన పథకానికి వినియోగదారుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. గత ఏడాది ప్రధాని నరేంద్రమోదీ ఈ పథకాన్ని ప్రకటించటంతోపాటు వేల కోట్ల రూపాయిల నిధులను కేటాయించారు. గృహ వినియోగదారులకు మాత్రమే ఉపయోగపడే ఈ పథకంపై ఇప్పుడిప్పుడే ప్రచారం పెరగటంతో వినియోగదారులు ఆసక్తి పెంచుకుని ఏర్పాటు చేసుకుంటున్నారు. ఈ విద్యుత్ వల్ల బిల్లులు కూడా తగ్గుతున్నాయి. సోలార్ ప్యానల్స్ 25 ఏళ్ళు పని చేస్తాయని చెబుతున్నారు. స్పష్టమైన ఎండ ఉంటే ఒక రోజుకు 1కిలో వాట్ సౌరశక్తి విద్యుత్ కేంద్రం 4 నుంచి 4.5 యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి చెయ్యగలదని చెబుతున్నారు. నేడు విద్యుత్ బిల్లులు పెరిగిపోతున్న నేపథ్యంలో వినియోగదారులు ఈ ప్యానల్స్‌ను ప్రభుత్వం అందించే సబ్సిడితో ఏరాౄటు చేసుకుంటున్నారు.

ఉమ్మడి జిల్లాలో 480 దరఖాస్తులు

పీఎం సూర్యఘర్‌కు ఉమ్మడి జిల్లాలో మంచి స్పందన కనిపిస్తోంది. ఉమ్మడి జిల్లా ఏలూరు సర్కిల్‌లో 480 దరఖాస్తులు రాగా అత్యధికంగా ఏలూరులో 117, తాడేపల్లిగూడెం డివిజన్‌లో 98 వరకు దరఖాస్తులు వచ్చాయి. నిడదవోలులో 91, నరసాపురంలో 77 జంగారెడ్డిగూడెంలో 25, భీమవరంలో 77 దరఖాస్తులు వచ్చాయని చెబుతున్నారు. ఇంకా ఈ సంఖ్యపెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

బ్యాంకు రుణ సదుపాయం

ఈ పథకానికి బ్యాంకుల నుంచి తక్కువ వడ్డీకి రుణాలు కూడా అందిస్తున్నాయి. ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంకు, బ్యాంకు ఆఫ్ బరోడా, బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ బ్యాంకు, కెనరా బ్యాంకు, బ్యాంకు ఆఫ్ మహారాష్ట్ర రుణాలు అందిస్తున్నాయి.

ఆన్‌లైన్‌లో దరఖాస్తులు

వినియోగదారులు విద్యుత్‌శాఖ అధికారులను సంప్రదించటంతో పాటు ఏపీఈపీడీసీఎల్, పీఎం సూర్యఘర్ పోర్టల్‌లో దరఖాస్తులు చేసుకునే అవకాశం కూడా కల్పించారు.

ప్రత్యేక మీటర్ ఏర్పాటు

ఈ పథకం కింద సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసుకునేవారికి ప్రత్యేకంగా మీటర్‌ను ట్రాన్స్ కో అధికారులు ఏర్పాటు చేస్తారు. దీని ద్వారా మనం ఎంత విద్యుత్ వాడుకున్నాం అనేది తెలుస్తుంది. అంతే కాకుండా ప్రత్యేక యాప్ ద్వారా రోజుకు ఎంత విద్యుత్ ఉత్పత్తి అయిందనేది మెసేజ్ రూపంలో వినియోగదారునికి చేరుతుంది.

మిగులు విద్యుత్‌కు సొమ్ము

వినియోగదారుడు దగ్గర ఉత్పత్తి అయ్యే విద్యుత్‌కు సంబంధించి మిగులు విద్యుత్ నేరుగా ఆశాఖకు చేరుతుంది. ట్రాన్స్‌కో వాడుకున్న విద్యుత్‌కు కూడా సొమ్ములు చెల్లిస్తుంది. దీని వల్ల కూడా వినియోగదారునికి ఆదాయం వస్తుందని అధికారులు చెబుతున్నారు. కిలో వాట్ లోడ్‌తో ఏర్పాటు చేసుకుంటే ఏడాదికి రూ.8వేలు ఆదాయం ఆదా అవుతుందని అంచనా వేస్తున్నారు. 2కిలో వాట్‌లకు అయితే రూ.20వేలు, 3కిలో వాట్‌కు రూ.32వేల 400కు ఆదాయం ఆదా అవుతుందని అంచనావేస్తున్నారు.

సోలార్ విద్యుత్‌పై గోడపత్రిక ఆవిష్కరణ

సోలార్ విద్యుత్ ఏర్పాటుకు ప్రజలు ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి కోరారు.గ ురువారం కలెక్టరేట్‌లో ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకం కింద సోలార్ రూఫ్ టాప్ నిర్మించుకోవడానికి సమాచార గోడ ప్రతిని, కరపత్రాలను జిల్లా కలెక్టర్ నాగరాణి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇంటి పైకప్పుపై సోలార్ ప్యానళ్ళను ఏర్పాటు చేసుకుని ఉచిత విద్యుత్ పొందడమే కాకుండా మిగులు విద్యుత్‌ను విక్రయించి ఆదాయం పొందవచ్చునన్నారు.



సబ్సిడీ ఇలా...

కిలో వాట్స్	ఖరీదు	సబ్సిడి	కస్టమర్ చెల్లించాల్సింది	కావలసిన స్థలం
1 కిలోవాట్‌కు	రూ.50వేలు	రూ.30వేలు	రూ.20వేలు	130ఎస్ఎఫ్‌టీ
2 కిలోవాట్‌కు	రూ.1లక్ష	రూ.60వేలు	రూ.40వేలు	200 ఎస్ఎఫ్‌టీ
3 కిలోవాట్‌కు	రూ.లక్షా45వేలు	రూ.78వేలు	రూ.67వేలు	300 ఎస్ఎఫ్‌టీ
4 కిలోవాట్‌కు	రూ.లక్షా85వేలు	రూ.78వేలు	రూ.లక్షా7వేలు	400 ఎస్ఎఫ్‌టీ

ఎంపీడీవోల బదిలీ

సొంత స్థానాలకు వెళ్లనున్న అధికారులు

భీమవరం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ అధికారులు బదిలీ కానున్నారు. ప్రభుత్వం ఆ దిశగా ఉత్తర్వులు జారీచేసింది. పంచాయతీ రాజ్ డైరెక్టర్‌కు దిశానిర్దేశం చేసింది. ఎన్నికల ముందు జిల్లాలో ఎంపీడీవోలను బదిలీ చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి, ఉమ్మడి కృష్ణా జిల్లాలకు బదిలీ చేశారు. ఇతర జిల్లాల నుంచి ఎంపీడీవోలను జిల్లా మండల పరిషత్‌లలో నియమించారు. ఎన్నికల ప్రక్రియ ముగియడంతో గతంలో వెళ్లిన ఎంపీడీవోలు తిరిగి సొంత మండలాలకు రానున్నారు. ఆ మేరకు పంచాయతీ రాజ్ డైరెక్టర్ చర్యలు తీసుకోనున్నారు. తహసీల్దార్‌ల విషయానికొచ్చేసరికి ప్రభుత్వం స్థానికతను పరిగణలోకి తీసుకున్నది. స్థానికత ఉన్న తహసీల్దార్‌లకు సొంత డివిజన్‌లలో పోస్టింగ్ ఇవ్వరాదంటూ సూచించింది. మండల పరిషత్ అధికారుల విషయంలో ఎన్నికల ముందు పనిచేసిన చోటకే బదిలీ చేయాలంటూ ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. స్వల్ప వ్యవధిలోనే మండల పరిషత్ అధికారులు సొంత స్థానాలకు రానున్నారు. ప్రస్తుతం పనిచేస్తున్న మండల పరిషత్ అధికారులు తమ సొంత స్థానాలకు వెళ్లిపోనున్నారు. జిల్లాలో 20 మండలాలున్నాయి. పాత అధికారులు మళ్లీ రానున్నారు.

ఎస్‌ఎంసీ ఎన్నికలు ప్రశాంతం

జిల్లాలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్‌ఎంసీ) ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. ఎటువంటి సంఘటనలు చోటు చేసుకోలేదు. జిల్లాలోని 1350 ప్రభుత్వ స్కూళ్లతో పాటు 27 ఎయిడెడ్ స్కూల్స్ కూడా కొత్త కమిటీలను ఎన్నుకున్నాయి. వీటిలో గురుకుల పాఠశాలలు కూడా ఉన్నట్టు అధికారులు తెలిపారు. ఉదయం నుంచి కొన్ని హైస్కూళ్ల వద్ద ఎన్నికల సందడి కనిపించింది. ఇద్దరు ముగ్గురు పోటీ పడటంతో పార్టీ పెద్దలు జోక్యం చేసుకుని ఎన్నికల్ని ఏకపక్షంగా జరిగేందుకు కృషి చేశారు.

1350 ప్రభుత్వ, 27 ఎయిడెడ్ స్కూళ్లకు కొత్త కమిటీలు



ఆచంటలో విద్యా కమిటీ ఎన్నికల్లో పాల్గొనడానికి విచ్చేసిన తల్లిదండ్రులు

నరసాపురం, ఆగస్టు 8: షెడ్యూల్ ప్రకారం ఉదయం అన్ని స్కూళ్ళల్లో ఎస్‌ఎంసీ ఎన్నికలు జరిగాయి. మధ్యాహ్నం నుంచి ఛైర్మన్, వీసీ ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికైన కమిటీ సభ్యుల చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈప్రక్రియను హెచ్ఎంలు పర్యవేక్షించారు. కొన్ని స్కూళ్లను జిల్లా సీఎంసీ కమిటీ సీఈవో చంద్రశేఖర్ పర్యవేక్షించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరగడంతో ఉపాధ్యాయులు ఊపిరిపీల్చుకున్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తరువాత నిర్వహించిన తొలి ఎన్నికలు ఇదే కావడంతో రాజకీయ పార్టీల్లోనూ టెన్షన్ నెలకొంది. స్కూళ్ళకు ఛైర్మన్ పదవి కావడంతో చాలా మంది విద్యార్థుల తల్లిదండ్రులు ఈపదవులపై ఆశపడ్డారు. అయితే సామాజిక సమీకరణలు, విద్యావంతుల్ని పరిగణలోకి తీసుకుని కమిటీ బాధ్యతల్ని అప్పగించారు. జిల్లాలో మొత్తం 1350 ప్రభుత్వ స్కూళ్లు ఉన్నాయి. వీటిలో 209 జడ్పీ, 1060 ప్రాథమిక, 81 యూపీ స్కూళ్లు ఉన్నాయి. ఇవి కాకుండా 29 ఎయిడెడ్ స్కూళ్లు ఉన్నాయి. ఇందులో 27 స్కూళ్లకు మాత్రమే ఎన్నికలు నిర్వహించాయి. కోర్టు పరిధిలో ఉండటంతో రెండు ఎయిడెడ్ స్కూళ్లు లో ఎన్నికలు నిర్వహించలేదు. మిగిలిన అన్ని చోట్ల ప్రశాంతంగా ముగిశాయి. కొన్ని స్కూళ్ళల్లో ఛైర్మన్ ప్రమాణ స్వీకారోత్సవాలు ఆట్టహాసంగా జరిగాయి. గ్రామ పెద్దలతో పాటు మండల, పార్టీలకు చెందిన ముఖ్య నాయకులు కూడా హాజరయ్యారు. ఎన్నికైన కొత్త కమిటీలు రెండేళ్ల పదవికాలంలో ఉంటాయి.



సంపద కేంద్రాలు వినియోగంలోకి తేవాలి

అధికారులతో జిల్లా కలెక్టర్ నాగరాణి సమీక్ష

భీమవరం టౌన్, ఆగస్టు 8: వచ్చే అక్టోబరు 2వ తేదీ నాటికి జిల్లాలో చెత్త నుంచి సంపద సృష్టించే 383 కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని జిల్లా కలెక్టరు చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో తాగునీరు, శానిటేషన్, వీధి ఎల్ఈడీ లైట్స్, ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన, సర్పంచ్‌లు, కార్యదర్శుల మూడురోజుల శిక్షణ, ఇంటి పన్ను తదితర 15 అంశాలపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టరు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ జిల్లాలో 409 గ్రామ పంచాయతీలకు గాను 166 పంచాయతీలో చెత్త నుంచి సంపద సృష్టించే షెడ్లు ఉన్నాయని అన్నారు. వాటిలో 166 మాత్రమే వినియోగంలో ఉన్నాయని, ఈ నెలాఖరు నాటికి 49 కేంద్రాలను, సెప్టెంబరు 15వ తేదీ నాటికి 73 కేంద్రాలను, మిగిలినవి సెప్టెంబరు 30 తేదీ నాటికి వినియోగంలోకి తేవాలని అన్నారు. సంపద కేంద్రాలను సుందరంగా తీర్చిదిద్దాలని, కేంద్రాల వద్ద శానిటేషన్, తాగునీరు, తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. చెత్తను సేకరించే మూడు చక్రాల సైకిళ్ళు వినియోగంలోకి తేవాలని, చిన్నచిన్న రిపేర్లు ఉంటే చేయించాలని అన్నారు. చెత్త కాలువల్లో, డ్రెయిన్‌లలో వేయడం వల్ల ప్రజా ఆరోగ్యానికి తీవ్ర ముప్పుగా ఉందన్నారు. ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం కింద జిల్లాలో 1,50,158 అప్లికేషన్లు పరిశీలించి సోమవారం లోపుగా పూర్తిస్థాయిలో నివేదికలు అందించాలన్నారు. తాగునీటిని పూర్తిస్థాయిలో క్లోరినేషన్‌తో శుద్ధి చేసి, ల్యాబ్‌లలో నీటిని పరీక్షలు చేసి, అనంతరం సురక్షితమైన తాగునీరు రెండు పూటలా ప్రజలకు అందించాలన్నారు. కార్యక్రమంలో పలు శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అక్రమార్కులపై.. పిడుగు!





అక్రమార్కులపై కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పిడుగు పాటైంది. మూడునెలలపాటు అసైన్డ్, 22ఏ భూముల రిజిస్ట్రేషన్లు నిలుపుదల చేయాలని కీలక నిర్ణయం తీసుకున్నారు. గత ఐదేళ్ల పాటు ఈ భూములకు సంబంధించి లావాదేవీల అసలు రహస్యం బయటకు తీయాలని మరో నిర్ణయం తీసుకున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వందలాది ఎకరాలు కొన్నేళ్లుగా కొందరి వశమయ్యాయి. ఫ్రీహోల్డ్‌ను జాగ్రత్తగా తమకు అనుకూలంగా మలచుకుని భూములను రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారు. ఇప్పటికే ఈ తరహా భూముల్లో అనేకం చేతులు మారినట్టు సమాచారం. ఇంకొందరు తనఖాలు పెట్టినట్టు చెబుతున్నారు. వీటన్నింటిపైన రాబోయే మూడు నెలల్లోనే పక్కాగా అసలు తేల్చబోతున్నారు.

మూడు నెలలపాటు అసైన్డ్, 22ఏ భూముల రిజిస్ట్రేషన్ నిలుపుదల

- భూ 'రహస్యం' నిగ్గు తేల్చేలా సర్కారు నిర్ణయం
- వైసీపీ హయాంలో వేల ఎకరాల్లో సాగిన రిజిస్ట్రేషన్లు
- వీటన్నింటిపైనా మూడు నెలల్లో విచారణ
- నిజాలు నిగ్గు తేల్చేలా అధికారులకు సంకేతాలు
- తాజా మంత్రివర్గ నిర్ణయంతో వైసీపీ అనుకూలురు బెంబేలు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :

ఒకటి కాదు రెండు కాదు.. వందల ఎకరాల అసైన్డ్ భూములు.. ఇవికాక మెట్ట ప్రాంత నియోజకవర్గాలన్నింటిలోనూ మరికొన్ని వేలాది ఎకరాల్లో నిషేధిత భూము లు గత ఐదేళ్లల్లో జగన్ ప్రభుత్వ నిర్వాకంతో అత్యధికం ఆ పార్టీ అనుకూలురు పరమయ్యాయి. తొలుత పేదల ఆధీనంలో ఉన్న ఈ భూములు వారికే చెందాలని ఒక నినాదాన్ని అప్పటి వైసీపీ ప్రభుత్వం జనంలోకి ప్రచారం చేసింది. అప్పటి సిట్టింగ్ ఎమ్మెల్యేలు సర్వేయర్లు, ఇతర రెవెన్యూ అధికారుల నుంచి గ్రామాల వారీగా అసైన్డ్‌భూములు, నిషేధిత జాబితా లో ఉన్న భూముల వివరాలను రప్పించగలిగారు. అప్పటికే ఆయా భూములను ఎవరైనా అనుభవిస్తుంటే నయానో భయానో ఆ వ్యక్తులను కొన్నిచోట్ల తప్పించి, మరికొన్నిచోట్ల బెదిరించి తమ దారికి తెచ్చుకున్నారు. ఇదే తరుణంలో 22ఏ నిషేధిత భూముల జాబితాలో ఉన్న భూములను ఎవరైనా తమదేనంటూ రిజిస్ట్రేషన్ చేయించదలచుకుంటే అలాంటి సమస్యల పరిష్కారానికి అప్పటి జిల్లా కలెక్టర్‌కు ప్రత్యేక అధికారాలు ఇచ్చారు. అప్పట్లో ఎవరైనా ప్రతీ సోమవారం జరిగే పరిష్కార వేదికలో ఫిర్యాదులు ఇచ్చినా అవేవీ పెద్దగా పట్టించుకోలేదు. కాని కలెక్టర్లకే నేరుగా సమస్యలు విన్నవించినప్పుడు ఆ భూములపై రాజకీయ ప్రేరేపిత ఒత్తిడి పెరిగినప్పుడు అలవోకగా నిషేధం.. అనే పదం మాయమైంది. ఇలా ఉమ్మడి జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో ఎక్కడికక్కడ తమకు తోచినంత మేర రిజిస్ట్రేషన్లు జరిగేలా జాగ్రత్తలు పడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గత ఐదేళ్లల్లో జగన్ పాలనలో ఇష్టారాజ్యంగా జరిగిన భూ ఆక్రమణలు, వాటిపై వచ్చిన ఫిర్యాదులు, అధికారులపై ఒత్తిడి తెచ్చి అసైన్డ్ నిషేధిత భూముల జాబితాను సవరించి ఆ మేర చేసుకున్న రిజిస్ట్రేషన్ల వివరాలను నిగ్గు తేలుస్తామని ప్రకటించింది. తాజాగా జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఈ భూముల వ్యవహారంపై చర్చకు వచ్చింది. అసలు రహస్యాన్ని అన్ని చోట్ల వెలికితీయాలని నిర్ణయించడమే కాకుండా రాబోయే మూడు నెలల పాటు ఈ తరహా భూముల రిజిస్ట్రేషన్లను నిలుపుదల చేయాలని ఆదేశించింది. ఈ పరిణామం క్రమంలో ఈ మధ్యన జరిగిన కలెక్టర్ల సమావేశంలోను భూముల ఆక్రమణల విషయం పైనే ప్రధాన చర్చకు వచ్చిన విషయాన్ని కొందరు ప్రస్తావిస్తున్నారు. ఎందుకనంటే జిల్లాస్థాయిలోను ఆఖరుకి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్థాయిలోను ప్రజల నుంచి వస్తున్న వందలాది ఫిర్యాదుల్లో అత్యధిక భాగం వైసీపీ అనుకూలురు చేసిన దురాక్రమణల మీదే. దీంతో ప్రభుత్వం సీరియస్‌గా ముందుకు కదిలింది. ఈ అంశంలో కలెక్టర్లు మరింత చొరవ తీసుకునే విధంగా అంతర్గత ఆదేశాలు జారీ చేసినట్టు సమాచారం.

రాబోయే మూడు నెలల్లో నిజం తేలుతుందా..

గడిచిన రెండేళ్ల పాటు ఏకబిగిన సాగించిన వైసీపీ దుశ్చర్యలను ఎక్కడికక్కడ బయట పడకుండా పలుచోట్ల అయితే అధికారులే కవచంగా మారారు. ఆయా భూములన్నీ ఏనాడో సదరు వ్యక్తికి రిజిస్ట్రేషన్ అయ్యాయని, ఇప్పుడు తామేమి చేయాలంటూ కొందరి అభ్యంతరాలపై తప్పించుకునే ప్రయత్నం చేశారు. సమాచారాన్ని దాచిపెట్టారు. రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో జరిగిన వ్యవహారం మూడో కంటికి తెలియకుండా పోయింది. ఇంతలా సాగిన భూదందా వ్యవహారం కూటమి ప్రభుత్వం ప్రకటించినట్టు రానున్న మూడు నెలల్లో పూర్తిగా వెలికి రాగలదా అనేదే ఇప్పుడు అందరిలోనూ సందేహం. కాని గడిచిన రెండు నెలలుగా ఎక్కడికక్కడ కొన్ని విషయాలు బయటపడడం, ఇప్పుడు తీగలాగితే డొంక కదలక మానదని క్షేత్రస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు అసలు రహస్యాన్ని ఛేదించక తప్పదని అధికారులు భావిస్తున్నారు.



రూ.2 లకే బిర్యానీ ప్యాకెట్

మీరు విన్నది నిజమే.. రూ. 2 లకే బిర్యానీ ఇచ్చారు..తాడేపల్లిగూడెంలో ఓ హోటల్ ప్రారంభోత్సవం సందర్భంగా ఈ ఆఫర్ ప్రకటించారు. ఇక జనం ఒక్కసారిగా హోటల్ ముందు బారులు తీరారు. దీంతో మెయిన్ రోడ్డు స్తంభించింది. హోటల్ ప్రచారం కోసమని నిర్వాహకులు 200 పొట్లాలు సిద్ధం చేయగా రెండు వేల మంది వరకూ ఈ ఆఫర్ కోసం ఎగబడ్డారు. దీంతో అక్కడ ట్రాఫిక్ జామ్ అయింది. పరిస్థితి చక్కదిద్దేందుకు పోలీసులు చెమటోడ్చాల్సి వచ్చింది.

- తాడేపల్లిగూడెం రూరల్



మాధవరం వద్ద వంతెనపై ఉధృతంగా ప్రవహిస్తున్న ఎర్రకాలువ

ఉధృతంగా ఎర్రకాల్వ

ఎర్రకాలువ వరద ఉధృతి రోజు రోజుకు పెరుగుతోంది. నిన్నటి వరకూ కాలిబాట వంతెనను తాకుతూ వెళ్లిన ఎర్రకాల్వ గురువారం నాలుగు అడుగులు పెరిగి ప్రవహిస్తోంది. వరద నీరు నిన్నటి వరకూ తగ్గినట్టే కనిపించినా మాధవరం, జగన్నాధపురం, మారంపల్లి, నందమూరు, ఆరుళ్ల పంట చేలకు వరదనీరు ఎగపోడుస్తోంది. దీంతో రైతుల్లో ఆందోళన నెలకొంది.

- తాడేపల్లిగూడెం రూరల్



మంత్రికి వినతిపత్రితం అందజేస్తోన్న 'అపుస్మా' నాయకులు

రోడ్ ట్యాక్స్ తగ్గింపునకు మంత్రికి 'అపుస్మా' వినతి

ఏలూరు అర్బన్, ఆగస్టు 8 : ప్రైవేటు విద్యాసంస్థల బస్సులపై గత వైసీపీ ప్రభుత్వం 300 శాతం మేర పెంచిన రోడ్డుపన్నును తగ్గించాలని మంత్రిని కోరారు.

గురువారం ఏలూరు విచ్చేసిన రవాణాశాఖ మంత్రి ఎం.రాంప్రసాద్‌రెడ్డిని ఏపీ ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల సంఘం (అపుస్మా) నాయకులు డాక్టర్ ఎం.బి.ఎస్.శర్మ, కె.విజయలక్ష్మి, కె.చంద్రశేఖరరావు,ప్రసాద్, వినోద్, ఎస్.సతీష్, రాణా తదితరులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఏ రాష్ట్రంలోనూ రోడ్డు ట్యాక్స్‌ను ఒకేసారి ఇంతభారీగా పెంచలేదని మంత్రి దృష్టికి తీసుకెళ్ళారు. మంత్రితో పాటు అక్కడే వున్న ఎమ్మెల్యేలు బడేటి చంటి, చింతమనేని ప్రభాకర్, సొంగా రోషన్‌కుమార్‌లకు కూడా అభ్యర్థనలను అందజేశారు. తమ వినతిపై స్పందించిన మంత్రి ఈ సమస్యను ఉన్నతాధికారుల పరిశీలనకు వెంటనే పంపాలని ఆదేశించారని 'అపుస్మా' నాయకులు తెలిపారు.

పోలవరం నిర్వాసితులను ఆదుకోండి : ఎంపీ మహేష్

ఏలూరు టూటౌన్, ఆగస్టు 8: పోలవరం నిర్వాసితులు లక్షా 20 వేల మందికి న్యాయం చేయాలని, పామాయిల్ రైతులకు ఇంక్యూబేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని పార్లమెంట్‌లో ఎంపీ పుట్టా మహేష్‌యాదవ్ విజ్ఞప్తి చేశారు. ప్రశ్నోత్తరాల సమయంలో మహేష్ మాట్లాడారు. రాష్ట్రంలో 26 జిల్లాలకు 7 ఇంక్యూబేషన్ సెంటర్లు మాత్రమే ఉన్నాయన్నారు. జిల్లాలో లక్షమంది పామాయిల్ రైతులున్నారని అన్నారు. ఏలూరులో వ్యవసాయ పరిశోధన ప్రోసెసింగ్ ఉత్పత్తి కేంద్రం ఏర్పాటు చేయాలని పరిశ్రమల శాఖ మంత్రి జితిన్‌రామ్‌ను కోరారు. పోలవరం నిర్వాసితులకు ఉపాధి అవకాశాలు, మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు.

జడ్పీ ఛాంబర్ నూతన కార్యవర్గం ఎంపిక


ఏలూరుసిటీ, ఆగస్టు 8: జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ అధ్యక్షతన ఏలూరు జిల్లా పరిషత్ క్యాంపు కార్యాలయంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో గల జడ్పీటీసీ సభ్యులతో ఛాంబర్ నూతన కార్యవర్గం సమావేశం నిర్వహించి కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. జడ్పీటీసీ ఛాంబర్ అధ్యక్షులుగా పోలనాటి శ్రీనివాసరావు (బాబ్జి), ఉపాధ్యక్షులుగా కోరిపల్లి జయలక్ష్మి, సెక్రటరీగా బొక్కా రాధా కృష్ణ, జాయింట్ సెక్రటరీగా మోలుగుమాటి నీరజ, ట్రెజరర్‌గా కొయ్యే సూర్యారావు, కార్యవర్గ సభ్యులుగా జి.రామలక్ష్మి, ఆర్.కనకదుర్గ, సీహెచ్ శ్యామ్యూల్, వసంత రావులను ఎన్నుకున్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని జడ్పీటీసీ సభ్యులు పాల్గొన్నారు.అనంతరం జడ్పీటీసీ సభ్యులతో చైర్‌పర్సన్ సమావేశం నిర్వహించారు.



పరీక్షలను పరిశీలిస్తున్న మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శశిధర్

ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం పరీక్షలు

ఏలూరు క్రైం, ఆగస్టు 8 :ఏలూరులో ఉన్న ప్రభుత్వ మెడికల్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు ఫైనల్ ఎగ్జామ్స్ ఈనెల 6వ తేదీన ప్రారంభమయ్యాయి. అనాటమి పేపర్-2 పరీక్ష గురువారం నిర్వహించారు. ఏలూరు ప్రభుత్వ మెడికల్ కళాశాలలో గత ఏడాది 150 మంది విద్యార్థులు ఎంబీబీఎస్‌లో అడ్మిషన్లు పొందారు. వీరందరూ ఏడాది పాటు అనాటమీ, ఫిజియాలసీ, బయో కెమిస్ట్రీ సబ్జెక్టులపై విద్యనభ్యసించారు. ఫైనల్ ఎగ్జామ్స్ ఈనెల 6వ తేదీ నుంచి రోజు విడిచి రోజు ఈనెల 16 వరకూ జరుగనున్నాయి. ఒకొక్క సబ్జెక్టుకు రెండు పేపర్లు రాయనున్నారు.ఈనెల 19 నుంచి 24 వరకూ ప్రాక్టికల్స్ జరుగుతాయి. పరీక్షను మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శశిధర్ పరిశీలించారు.



సర్దుపోటు

తలనొప్పిగా మారిన టీచర్ల వర్క్ అడ్జస్ట్‌మెంట్

అధికారులకు సిఫారసుల ఒత్తుళ్లు

'సెలవు' దిశగా విద్యాధికారుల యోచన

నేడే మండల స్థాయిలో సర్‌ప్లస్ టీచర్లకు కౌన్సెలింగ్

మార్గదర్శకాలను సవరించాలని ఉపాధ్యాయ సంఘాల వినతి

ఏలూరు అర్బన్, ఆగస్టు 8 : టీచర్ల వర్క్ అడ్జస్ట్‌మెంట్ (పని సర్దుబాటు) విద్యాశాఖకు కత్తిమీద సాములా తయారైంది. జిల్లా విద్యాశాఖతో ప్రమేయం లేకుండా తమవద్దవున్న స్కూల్ యూడైస్ డేటా, టీచర్ ఇన్ఫర్మేషన్ సిస్టం (టిస్) డేటాలను అనుసంధానం చేసుకుని ఈ నెల 1వతేదీ నాటి స్టూడెంట్, టీచర్ నిష్పత్తి ప్రకారం నేరుగా రాష్ట్రస్థాయి నుంచే వర్క్ అడ్జస్ట్‌మెంట్ ప్రక్రియను ఈ దఫా చేస్తున్నప్పటికీ జిల్లాలో విద్యాధికారులపై పలువురు ప్రజా ప్రతినిధుల నుంచి ఒత్తిళ్లు తప్పడం లేదు. గత వైసీపీ ప్రభుత్వంలో ఉపాధ్యాయుల బదిలీలు కౌన్సెలింగ్‌తో నిమిత్తం లేకుండా పలువురికి దొడ్డిదారిన జరిగిన విషయం తెలిసిందే. స్థానిక ప్రజాప్రతినిధులు జిల్లా విద్యాధికారులపైన, రాష్ట్రస్థాయిలో విద్యాశాఖ ఉన్నతాధికారులపైన ఒత్తిళ్లు తెచ్చిమరీ డిప్యూటేషన్లు, క్లియర్ వేకెన్సీలకు బదిలీ ఉత్తర్వులు తెచ్చుకోవడం కొన్నేళ్లపాటు వివాదాస్పదమైంది. ఇలా ఒత్తిళ్లతో బదిలీలు చేయించుకోవడం వల్ల సంబంధిత టీచర్లకు ఒకింత వెసులుబాటు ఉండవచ్చుగాని క్షేత్ర స్థాయిలో అనేక పాఠశాలల్లో మరీ ముఖ్యంగా మారుమూల గ్రామాలు, ప్రాంతాల్లో ఆయా సబ్జెక్టుల బోధనకు అసలు టీచర్లేలేని పరిస్థితులు తలె త్తాయి. ఈ నేపథ్యంలో ఇటీవలే అధికార పగ్గాలను చేపట్టిన కూటమి ప్రభుత్వం పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతను అధిగమించడానికి పార దర్శకతతో కూడిన వర్క్ అడ్జస్ట్‌మెంట్‌ను చేపట్టింది. దీనికనుగుణంగానే గతంలో ఎన్నడూ లేనివిధంగా ఆయా సబ్జెక్టుల్లో పీజీ విద్యార్హతలున్న ఎస్టీటీలను సైతం హైస్కూళ్లలో స్కూల్ అసిస్టెంట్లుగా నియమించడం ద్వారా ఉపాధ్యాయుల కొరత అనేదే లేకుండా చర్యలు చేపట్టింది. అయితే నూతన విధానంలోనూ జిల్లా విద్యాధికారులపై ఒత్తిళ్ళు తప్పడం లేదని సమాచారం. తాత్కాలిక ప్రాతిపదికన కొరతవున్న పాఠశాలలకు సర్‌ప్లస్ టీచర్లను వర్క్ అడ్జస్ట్‌మెంట్‌పై పారదర్శకంగా కౌన్సెలింగ్ ప్రాతిపదికన నియమించడానికి విద్యాశాఖ కార్యాచరణ చేపట్టింది. కాగా 'తమ వాళ్ళను' ఫలానా ప్రాంతంలోని పాఠశాలకు వర్క్ అడ్జస్ట్‌మెంట్ కింద నియమిం చాల్సిందేనంటూ పలువురు ప్రజాప్రతినిధులు సిఫారసు లేఖలతోను, ఫోన్‌ల ద్వారా విద్యాధికారులపై ఒత్తిడి తెస్తున్నట్టు తెలుస్తోంది. ఇటువంటి సిఫార సులను అంగీకరించడం లేదా అమలు చేయడం కూటమి ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాల ప్రకారం అసాధ్యమని విద్యాధికారులు స్పష్టం చేస్తున్నప్పటికీ ఎలాగైనా చేయాల్సిందేనని పట్టుబడుతున్నట్టు సమాచారం. ఒక్కో ప్రజాప్రతినిధి నుంచి పదుల సంఖ్యలో వస్తోన్న సిఫారసులను అమలు చేయడం సాధ్యం కాదని నచ్చజెప్పేకంటే కొద్దిరోజులపాటు 'సెలవు'పై వెళ్ళిపోవడమే బెటరని విద్యాధికారులు భావిస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. సిఫారసులను అమలు చేయాల్సి వస్తే కనిష్టంగా వంద కిలోమీటర్ల నుంచి గరిష్టంగా 180 కిలోమీటర్ల వరకు దూరంలోని ప్రస్తుత పాఠశాల నుంచి వర్క్ అడ్జస్ట్‌మెంట్ కింద నియమించాల్సి వస్తుందని ప్రభుత్వ మార్గదర్శకాలకు పూర్తిగా విరుద్ధమని చెబుతున్నారు.

వేగం పెంచిన విద్యాశాఖ

ఈ నెల 11 నాటికల్లా టీచర్ల పనిసర్దుబాటు ప్రక్రియను పూర్తిచేసి, ఆయా స్థానాలకు తాత్కాలికంగా నియమితులైన ఉపాధ్యాయులంతా 12న విధులు చేపట్టేలా విద్యాశాఖ కసరత్తుని మరింత వేగవంతం చేసింది. ఇందులో భాగంగా గురువారం జిల్లాలో పలు పాఠశాలల యూడైస్ కోడ్‌లను సేకరించడంతో పాటు, క్షేత్రస్థాయిలో సర్‌ప్లస్ టీచర్లు, విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్‌లపై వివరాలను ఎప్పటికప్పుడు తీసుకుంది. తాజాగా సవరించిన షెడ్యూల్ ప్రకారం శుక్రవారం మధ్యాహ్నానికల్లా అన్ని మండలాల ఎంఈవోలకు పాఠశాలల వారీగా సర్‌ప్లస్, డెఫిసిట్ టీచర్ల వివరాలతో కూడిన వేర్వేరు జాబితాలను ఆన్‌లైన్‌ద్వారా నేరుగా పంపించనున్నారు. ఆ వెంటనే సాయంత్రం నుంచి ఎంత ఆలస్యమైనా మండల స్థాయిలో సర్‌ప్లస్ టీచర్లకు కౌన్సెలింగ్ నిర్వహించాలని ఆదేశించారు. మండల స్థాయిలో సర్దుబాటు అనంతరం ఇంకా మిగిలిపోయిన సర్‌ప్లస్ ఉపాధ్యాయులకు శనివారం డివిజన్ స్థాయిలో కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. ఈ దఫా వర్క్ అడ్జస్ట్‌మెంట్ ప్రక్రియ మొత్తాన్ని జిల్లా విద్యా శాఖ ప్రమేయం లేకుండా రాష్ట్రస్థాయి నుంచే పర్యవేక్షిస్తుండటంతో పాటు,తుది ఆర్డర్లను కూడా జారీ చేస్తున్నారు. ఆ మేరకు గుర్తించిన మిగులు (సర్‌ప్లస్) టీచర్ల నుంచి డేట్ ఆఫ్ జాయినింగ్ (కేడర్‌లో)ను ప్రామాణికంగా తీసుకుని పాఠశాలల వారీగా జూనియర్లను ఆయా సబ్జెక్టుల నుంచి కొరతవున్న పాఠ శాలలకు కౌన్సెలింగ్ ద్వారా నియమించనున్నారు. సవరించిన గణాంకాల అనంతరం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో సుమారు 760 మంది ఎస్టీటీలు, స్కూల్ అసిస్టెంట్లు సర్‌ప్లస్ జాబితాలో ఉండగా, ఆయా సబ్జెక్టుల్లో 536 పోస్టులకు పాఠశాలల్లో టీచర్ల కొరత ఉంది. తుది గణాంకాల్లో ఈ సంఖ్యల్లో కొద్దిపాటి మార్పులు ఉండొచ్చు. మొత్తం మీద 'పని సర్దుబాటు' కేడర్ సీనియార్టీ ప్రకారం జూనియర్లకే వర్తింపజేస్తున్నప్పటికీ, ఉమ్మడి జిల్లాలో కొరతవున్న సబ్జెక్టు పోస్టుల సంఖ్య తక్కువగా ఉండటంతో కౌన్సెలింగ్ జాబితాల్లో చివరన వున్న జూనియర్లు ఎక్కడివారక్కడే ఉంటారని చెప్పవచ్చు.

ఏలూరు కార్పొరేషన్ టీచర్లకు సంకటస్థితి !

మున్సిపల్ టీచర్లను పాఠశాల విద్యాశాఖలోకి విలీనం చేసిన విషయం తెలిసిందే. ఆ ప్రకారం పంచాయితీరాజ్, మున్సిపల్ టీచర్లు ఏకమైన నేపథ్యంలో ఇపుడు చేపడుతున్న వర్క్ అడ్జస్ట్‌మెంట్‌లో ఏలూరు నగరపాలక సంస్థ యాజమాన్యంలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల్లో సర్‌ప్లస్‌గా గుర్తించిన వారిని కొరతవున్న పాఠశాలలకు సర్దుబాటు చేయడం ఒకింత ఇబ్బంది కరమేనని విద్యాధికారులు అంచనా వేస్తున్నారు. ఏలూరు కార్పొరేషన్ పాఠ శాలల్లో సుమారు 160 మందికిపైగా ఎస్టీటీ కేడర్ ఉపాధ్యాయులు సర్‌ప్లస్‌గా ఉండగా, కేవలం హైస్కూళ్ళలో మాత్రం 20 పోస్టులకు మాత్రమే కొరత ఉందని సమాచారం. ఇలా కొరతవున్న హైస్కూళ్ళకు సర్దుబాటు చేసినా మిగిలిపోయిన ఎస్టీటీలను ఏలూరు మండల పరిధిలోని పాఠ శాలలకు అడ్జస్ట్ చేయడానికి కూడా ఎక్కడా నీడ్ కనిపించడం లేదు. ఇక మిగిలిపోయిన సర్‌ప్లస్ టీచర్లను డివిజన్ పరిధిలో డీవైఈవో పూల్‌లోకి చేర్చి కొరతవున్న పాఠశాలలకు నియమించడానికి సాంకేతికపరమైన సమస్యలు వస్తాయని ఉపాధ్యాయ సంఘాలు చెబుతున్నాయి. ఒకవేళ డివిజన్ పరిధిలోని పాఠశాలలకు వర్క్ అడ్జస్ట్‌మెంట్ కింద నియమిస్తే వ్యతిరేకిస్తూ పలువురు న్యాయస్థానాన్ని ఆశ్రయించే అవకాశాలు లేకపోలేదని విద్యాశాఖ భావిస్తోంది.



ఉపాధ్యాయ సంఘాల జిల్లా నాయకులతో డీఈవో సమావేశం

ఉమ్మడి జిల్లాలో వర్క్ అడ్జస్ట్‌మెంట్ అమలుపై గురువారం సాయంత్రం అన్ని ఉపాధ్యాయ సంఘాల జిల్లా నాయకులతో డీఈవో అబ్రహం సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. పని సర్దుబాటుకు సహకరించాలని కోరారు. సర్దుబాటుకు ప్రామాణికతపై కొందరు నాయకులు అభ్యంతరాలను వ్యక్తం చేశారు. సర్‌ప్లస్ టీచరు మండలస్థాయి కౌన్సెలింగ్‌లో వేకెన్సీని కోరుకునేటపుడు ప్రస్తుత పాఠశాలలో చేరిన తేదీని ప్రామాణికంగా తీసుకుంటుండగా, అదే డివిజన్ స్థాయికి వచ్చేసరికి మాత్రం కేడర్‌ను ప్రామాణికంగా ఎలా తీసుకుంటారని ప్రశ్నించారు. ఇప్పటికీ పలు వురు టీచర్లు 'టిస్'లో డేటాను అప్‌డేట్ చేసుకోలేదని ఇవన్నీ పూర్తి కాకుండానే వర్క్ అడ్జస్ట్‌మెంట్ చేపట్టడం సమంజసం కాదన్నారు. అయితే ఈ విషయాలన్నీ రాష్ట్రస్థాయిలోనే పరిష్కరించుకోవాలని, జిల్లాస్థాయిలో తామేమీ చేయలేమని డీఈవో తేల్చిచెప్పారు.

కార్మికుల సంక్షేమం..ప్రయాణికుల క్షేమం ముఖ్యం

ఆర్టీసీకి కొత్త బస్సులు
ప్రారంభించిన రవాణా మంత్రి రాంప్రసాద్ రెడ్డి

ఏలూరు క్రైం, ఆగస్టు 8 : రాష్ట్రంలో ఆర్టీసీకి 1400 కొత్త బస్సులు కొనుగోలు చేశామని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి చెప్పారు. ఏలూరు ఆర్టీసీ బస్సు డిపోలో గురువారం విజయవాడ జోన్-2కు సంబంధించిన స్టార్ లైనర్, సూపర్ లగ్జరీ, ఆల్ట్రా డీలక్స్ మొత్తం 27 బస్సులను ఎమ్మెల్యేలు బడేటి రాధాకృష్ణయ్య (చంటి), చింతమనేని ప్రభాకర్, సొంగా రోషన్‌కుమార్‌లతో కలిసి మంత్రి ప్రారంభించారు. ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్టీసీని మరింత బలోపేతం చేస్తామని, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందిస్తామన్నారు. కార్మికుల సంక్షేమంతో పాటు ప్రయాణికుల క్షేమం తమకు ముఖ్యమన్నారు. గత ప్రభుత్వం గత ఐదేళ్లలో ఆర్టీసీకి ఒక్క బస్సును కూడా కొనుగోలు చేయలేదన్నారు. ప్రయాణికుల భద్రతకు, సుఖవంతమైన ప్రయాణానికి ప్రాధాన్యం ఇచ్చి కొత్త బస్సులు కొనుగోలు చేస్తున్నామన్నారు. తమ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలు మేరకు పని చేస్తోందన్నారు. ఈనెల 15వ తేదీ నుంచి రాష్ట్రంలో మొదటి దశలో 100 అన్నా క్యాంటీన్లు ప్రారంభిస్తున్నామన్నారు. తమది ఉద్యోగుల ఫ్రెండ్లీ ప్రభుత్వమని ఆర్టీసీ కార్మికుల సమస్యలపై సాను కూలంగా స్పందించి పరిష్కరించదగిన వాటిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరి స్తామన్నారు. కార్మికులు, ఉద్యోగులు సంతోషంగా ఉంటేనే వారు మెరుగైన సేవలు అందిస్తారన్నారు. తాను నెలలో 15 రోజుల పాటు ప్రత్యేక సమయం కేటాయిం చుకుని ఆర్టీసీ డిపోల్లో సమస్యలు పరిష్కార దిశగా పనిచేస్తున్నానన్నారు.ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గోపీనాథ్‌రెడ్డి, ఉప రవాణా కమిషనర్ శాంతకుమారి, ఏలూరు ఆర్టీవో ఎస్ఎస్‌కె ఖాజావలి, ఏలూరు, తూర్పు గోదావరి, కాకినాడ, కృష్ణా జిల్లాల ప్రజా రవాణాధికారులు ఎస్వీఆర్ వరప్రసాద్, షర్మిల, శ్రీనివాసరావు, వాణి, ఏలూరు డిపో మేనేజర్ వాణి, ఏలూరు డీఎస్పీ శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు. ఆర్టీసీ కార్మిక సంఘాలు వినతి పత్రాలను మంత్రికి అందజేశారు. వాటన్నింటిని పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. మంత్రి ప్రారంభించిన బస్సులు ఏలూరు డిపో నుంచి పాత బస్టాండ్ వరకూ వెళ్లి తిరిగి వచ్చాయి. వివిధ డిపోలకు కేటాయించిన బస్సులు ఆయా ప్రాంతాలకు వెళ్లిపోయాయి.



ఏలూరులో బస్సులకు పూజలు చేస్తున్న మంత్రి, ఎమ్మెల్యేలు

ఆలస్యమైనా ఫర్వాలేదు..సురక్షితంగా చేర్చండి
డ్రైవర్లతో ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్

ఆర్టీసి కార్మికులు డ్రైవింగ్‌లో తొందరపాటు తనం వద్దని ఆలస్యమైనా ఫర్వాలేదని ప్రయాణీకులను మాత్రం సురక్షితంగా గమ్యాలకు చేర్చాలని విజయవాడ రీజినల్ ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గోపీనాథ్‌రెడ్డి అన్నారు. ఏలూరు ఆర్టీసీ డిపోలో నూతనంగా బస్సులను ప్రారంభించిన సందర్భంగా ముందుగా ఆ బస్సు డ్రైవర్లతో ఆయన సమావేశం అయ్యారు. జాతీయ రహదారులపై తరచుగా ఆగి ఉన్న వాహనాలను ఢీకొట్టడమో లేదా ముందు వెళ్తున్న వాహనం అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో ఆ వాహనాన్ని ఢీకొనడం జరుగుతోందని వాహన వేగాన్ని బట్టి కొంత దూరం మెయింటైన్ చేయాలని సూచించారు. కొండ ప్రాంతాల్లో వెళ్ళేవారు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, మలుపుల్లో ఎంతో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మైలేజీ పెంచే దిశగా కార్మికులు తమ నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు.ఇచ్చిన సమయం అయిపోతుందని తొందరపాటు తనంతో డ్రైవింగ్ చేయవద్దని ప్రయాణికులను సురక్షిత ప్రాంతాలకు చేర్చడమే మన అందరి బాధ్యత అని సూచించారు. వాహనం ఎక్కే ముందు ఖచ్చితంగా అన్ని టైర్లను పరిశీలించుకోవాలని, బ్రేక్, హారన్, లైట్లు అన్ని చూసుకున్న తరువాతే వెళ్లాలన్నారు. ఆయనతో పాటు వివిధ జిల్లాల రీజినల్ మేనేజర్లు, డిపో మేనేజర్లు ఉన్నారు.



ఘనంగా పైడితల్లి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ

కాళ్ల, ఆగస్టు 8 : పైడితల్లి అమ్మవారి నామస్మరణతో జువ్వలపాలెం గ్రామం మారుమోగింది. కాళ్ల మండలం జువ్వలపాలెం గ్రామంలోని తూర్పుపేటలో భక్తులు, దాతలు, గ్రామ ప్రజలు సహాయ సహకారాలతో నూతనంగా నిర్మించిన గ్రామదేవత పైడితల్లి అమ్మవారి ఆలయంలో విగ్రహం, ఆలయ శిఖర, జీవధ్వజ ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించారు. వేద పండితులు ఫల్లేటికుర్తి గణపతిశర్మ బ్రహ్మత్వంలో గురువారం ఉదయం 9:30 నిమిషాలకు వేదమంత్రాల నడుమ అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు.నర్సాపురం పార్లమెంట్ మాజీ సభ్యుడు గోకరాజు గంగరాజు, టీడీపీ బోర్డు మాజీ సభ్యుడు గోకరాజు రామరాజు, జనసేన నాయకుడు చెనమల్ల చంద్రశేఖర్‌తో పాటు పలువురు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అఖండ అన్న సమారాధన నిర్వహించారు.

కొల్లేరు సరస్సును సందర్శించండి

గవర్నర్‌ను ఆహ్వానించిన ఎమ్మెల్యే కామినేని



కైకలూరు, ఆగస్టు 8: కొల్లేరు సరస్సులోని పక్షుల కేంద్రాన్ని సందర్శించాలని రాష్ట్ర గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్‌ను ఆహ్వానించినట్లు కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ తెలిపారు. అమరావతిలో గురువారం గవర్నర్‌ను కలసి ఆహ్వానించారు. ఈ నెల 17న నెల్లూరు స్వర్ణభారతీ ట్రస్ట్ 23వ వార్షికోత్సవంలో కూడా పాల్గొనాలని ఆహ్వానించారు. స్వర్ణభారతీ ట్రస్ట్ వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా భారత ఉప రాష్ట్రపతి జగదీప్ ధనకర్ కూడా హాజరవుతారని తెలిపారు.

గ్యాస్ లీక్ ప్రమాదం

చికిత్స పొందుతూ భార్యాభర్తల మృతి



చనిపోయిన మురళీ, కుమారి (ఫైల్ ఫొటో)

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 8: గ్యాస్ లీకై అగ్నిప్రమాదం సంభవించడంతో గాయాలపాలైన కుటుంబం తాడేపల్లిగూడెం ఏరియా ఆసు పత్రిలో చికిత్స పొందుతున్నారు. భార్య భర్తలు గురువారం మృతి చెందారు. తాడేపల్లిగూడెం మండలం ఎల్.అగ్రహారంలోని టిడ్కో ఇళ్ల వద్ద మంగళవారం ఉదయం గ్యాస్ బండ పేలిన ఘటనలో భార్య భర్తలు బోడపాడు మురళి (37), బోడపాడు కుమారి (34), కుమార్తె నీలిమలకు తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటనలో వారిని తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. చికిత్స పొందుతూ మురళి, కుమారిలు గురువారం మృతి చెందారు. నీలిమకు చికిత్స అందిస్తున్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ రమేష్ వివరించారు.

మంచిలి వద్ద బైక్‌పై వచ్చి చైన్ స్నాచింగ్

రూ.4.75 లక్షలు విలువ చేసే బంగారు వస్తువులు చోరీ

అత్తిలి, ఆగస్టు 8 : మహిళ మెడలో నుంచి నాలుగు లక్షల 75 వేల రూపాయల విలువ చేసే 25 కాసుల బంగారాన్ని దొంగిలించుకుపోయినట్లు అత్తిలి ఎస్ఐ రాంబాబు తెలిపారు. బుధవారం రాత్రి ఇరగవరం మండలం కె.ఇల్లింద్రపర్రు గ్రామానికి చెందిన పేరుమళ్ళ శ్రీరామూర్తి వేల్పూరు గ్రామంలో ఉంటున్న అక్క అయిన పచ్చిపులుసు లక్ష్మిని మోటారు సైకిల్‌పై ఎక్కించుకుని పాలకోడేరు మండలం కోరుకొల్లు గ్రామంలో తన మేనల్లుడి పెళ్ళి చూపులకు వెళ్లాడు. తిరిగి వస్తుండగా రాత్రి 8 గంటల సమయంలో పంచమర్రు గ్రామం దాటిన తరువాత మంచిలి డంపింగ్ యార్డుకు వచ్చేసరికి గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు మోటారు సైకిల్‌పై వచ్చి లక్ష్మీ మెడలో నుంచి బంగారపు గొలుసు లాగేందుకు ప్రయత్నించగా ఆమె భయంతో కిందకు పడిపోయింది. మోటారు సైకిల్‌పై నుంచి ఒక వ్యక్తి వచ్చి మెడలో 8 కాసులు బంగారు తాడు, 4 కాసుల నల్లపూసల తాడు, ఏడు కాసుల చంద్రహారం,ఆరు కాసుల బంగారు ముత్యాల దండ దొంగిలించుకుపోయారు.ఆమె కిందపడడంతో తలకు గాయమైంది. శ్రీరామ్మూర్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ రాంబాబు తెలిపారు.

క్రైం కార్నర్

మహిళ మెడలో బంగారం చోరీ

యలమంచిలి, ఆగస్టు 8: అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం గ్రామానికి చెందిన పెద్దిరెడ్డి దేవి మెడలో ఉన్న బంగారు నల్లపూసల తాడును ఇద్దరు అగంతుకులు లాక్కుని పరారయ్యారని ఎస్ఐ కె.గుర్రయ్య తెలిపారు. పెద్దిరెడ్డి దేవి, ఆమె భర్త సుబ్బారావులు ఇరువురు గురువారం పాలకొల్లులో ఫంక్షన్‌కు హాజరై మోటార్‌సైకిల్‌పై స్వగ్రామానికి తిరిగి వెళుతున్నారు. కాజ గ్రామపరిధిలోని జాతీయ రహదారిపై వెళుతుండగా ఇద్దరు వ్యక్తులు పల్సర్ బైక్‌పై వెనుక నుంచి వచ్చి దేవి మెడలో ఉన్న నల్లపూసల చైన్ లాక్కుని పరారయ్యారు. దేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బాలిక అదృశ్యం.. కేసు నమోదు

యలమంచిలి, ఆగస్టు 8: మండలంలోని గంగడపాలెం గ్రామానికి చెందిన పెమ్మాడి సైదులుస్వామి కుమార్తె మంగళవారం రాత్రి నుంచి కనిపించకుండా పోయినట్లు ఎస్ఐ కె.గుర్రయ్య తెలిపారు. సైదులుస్వామి కుటుంబ సభ్యులు మంగళవారం రాత్రి భోజనం అనంతరం నిద్రపోయారు. అర్ధరాత్రి మెలుకువ వచ్చిన సైదులుస్వామికి ఇంట్లో కుమార్తె కనిపించలేదు. కుమార్తె ఆచూకీ కోసం చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలించారు. బంధువుల ఇళ్ల వద్ద ఆరా తీసినా ఆచూకీ లభించలేదు. సైదులు ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

వాటర్ హీటర్ నుంచి విద్యుత్..ఒకరి మృతి

చింతలపూడి, ఆగస్టు 8: చింతలపూడి నాగిరెడ్డిగూడెంలో విద్యుత్‌షాక్‌కు గురై షిఫ్ట్ ఆపరేటర్ దేశావత్ రవి (36) దుర్మరణం పాలయ్యాడు. ఇంట్లో నీళ్ళు కాయటానికి వాటర్ హీటర్ పనిచేయడం లేదని చూసి ప్లగ్ పెడుతుండగా సప్లై రావడంతో ఒక్కసారిగా విద్యుదాఘాతానికి గురైయ్యాడు. చింతలపూడి ఆసుపత్రికి తరలించినా ఫలితం లేకపోయింది.

సిమ్మెంట్ డీలర్‌షిప్ ఇప్పిస్తానని మోసం

ద్వారకాతిరుమల, ఆగస్టు 8 : ద్వారకాతిరుమల మండలంలో కాకతీయ సిమ్మెంటు ఏజన్సీ ఇప్పిస్తానని నమ్మించి మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేశారు. కిరణ్ కుమార్ రెడ్డి అనే వ్యక్తి గతేడాది డిసెంబరులో ద్వారకాతిరుమలకు చెందిన పొనమాల నాగరాజు,ఇదే మండలానికి చెందిన తిమ్మాపురం గ్రామానికి చెందిన షేక్ భాషాలకు చెందిన సిమ్మెంటు దుకాణాల వద్దకు వెళ్లి వారిని పరిచయం చేసుకున్నాడు. కాకతీయ సిమ్మెంట్స్ డీలర్‌షిప్ ఇప్పిస్తానని చెప్పి షేక్ భాషా నుంచి రూ.1.56 లక్షలు, నాగరాజేష్ నుంచి రూ.2.08 లక్షలు తీసుకున్నాడు. ఈ విషయమై కాలయాపన జరపడంతో అనుమానం వచ్చి వారిద్దరూ ద్వారకాతిరుమల పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ జి.సతీష్ తెలిపారు.

వరుస చోరీలతో భయం..భయం

పాలకొల్లు అర్బన్, ఆగస్టు 8 : ఇటీవల కాలంలో పాలకొల్లు పట్టణం, మండలంలోనూ ఇళ్ళల్లో దొంగతనాలు పెరిగిపోతున్నాయి. గతనెలలో పట్టణంలో పగటి సమయంలోనే ఒక వృద్ధురాలిని గాయపరిచి నగదు, నగలు చోరీ చేశారు. ఇది మరువక ముందే పూలపల్లిలోని సాయంత్ర సమయంలో జనం తిరుగుతున్న సమయంలోనే చోరీ జరిగింది. పూలపల్లిలో చిరు వ్యాపారి బక్క శ్రీను బైటకు వెళ్ళగా సాయంత్రం 7.30 సమయంలో శ్రీను భార్య కృష్ణవేణి పిల్లల్ని ట్యూషన్ నుంచి తీసుకువెళ్లింది. ఆ సమయంలో ఇంటిలో చొరబడి సుమారు 20 కాసుల బంగారం, కేజీ వరకూ వెండి వస్తువులు, రూ.5000 నగదు దోచుకుపోయినట్లు శ్రీను పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఒంటరి మహిళలు, తాళం వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్నారు. పోలీసులు నిఘా పెట్టాలని కోరుతున్నారు.

వివాహిత అదృశ్యం

ముదినేపల్లి, ఆగస్టు 8 : ఇంటిలో చిన్న చిన్న మనస్పర్ధలతో ఓ వివాహిత యువతి అలిగి వెళ్లిపోయిన సంఘటన ఇది. ముదినేపల్లికి చెందిన కోన మహాలక్ష్మి భవాని (33) అనే యువతి గురువారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఆమె కోసం కుటుంబసభ్యులు వెదికినా ఫలితం లేకపోవడంతో గురువారం రాత్రి ముదినేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఆమె తలి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి ఎస్ఐ వెంకట్ కుమార్ దర్యాప్తు చేస్తున్నారు.

15న అన్నక్యాంటీన్లు ప్రారంభం : ఎమ్మెల్యే అంజిబాబు



అన్న క్యాంటీన్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే అంజిబాబు

భీమవరం టౌన్, ఆగస్టు 8 : పేదలకు కడుపునిండా భోజనం పెట్టాలనే తలంపుతో అన్నక్యాంటీన్లు ప్రారంభిస్తే వాటిని జగన్ ప్రభుత్వం నాశనం చేసిందని భీమవరం ఎమ్మెల్యే పులపర్తి అంజిబాబు విమర్శించారు. భీమవరంలోని బుధవారం మార్కెట్, పాత బస్టాండ్, జేపీ రోడ్డులోని అన్న క్యాంటీన్లు గురువారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ఈనెల 15న అన్ని చోట్ల అన్నక్యాంటీన్లు ప్రారంభిస్తున్నామన్నారు. ప్రస్తుతం భీమవరంలో మూడు అన్నక్యాంటీన్లు సుమారు రూ .25 లక్షలతో అన్ని ఏర్పాట్లు చేశామని, రూ.5 లకే పేదవారికి భోజనం అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ ఛైర్మన్ కోళ్ల నాగేశ్వరరావు, వబిలిశెట్టి రామకృష్ణ, గాదిరాజు తాతరాజు, రాట్నాల శ్రీనివాసరావు, కొప్పినిడి బాబి, చల్లా రాము, ఉప్పులూరి చంద్రశేఖర్, చిక్కాల వెంకటేశ్వ రరావు,నల్లం గంగాధర్‌రావు యనమదుర్రు నాగులు, ఎంతఈ త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

రొయ్యలపై అసత్య ప్రచారాన్ని తిప్పికొట్టాలి : కలెక్టర్

భీమవరంటౌన్, ఆగస్టు 6 : భారతీయ రొయ్యల రంగంపై యూఎస్ మీడియా చేస్తున్న అసత్య ప్రచారాన్ని తిప్పి కొట్టాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. గురువారం స్థానిక కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరంలో ఆక్వా రైతులు, ఉత్పత్తిదారులు, డీలర్స్ ఎగుమతిదారులు, ఎంపెడ, మత్స్యశాఖ అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ జిల్లా నుంచి నాణ్యమైన ఆక్వా ఉత్పత్తుల ఎగుమతి, కార్మికుల సంరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. యూఎస్ మీడియా చేస్తున్న ఆరోపణలు, ప్రతికూల ప్రచారంతో రొయ్యల ఎగుమతిపై ప్రభావం పడుతుందన్నారు. ఆక్వా కల్చర్‌లో రాష్ట్రంలో మన జిల్లా తృతీయ స్థానంలో ఉందన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయభాస్కరరావు, జిల్లా ఎంపెడా అధికారి టి.జి మనోజ్ కుమార్, జిల్లా మత్స్య శాఖ అధికారి ఎన్‌వీఎస్ ప్రసాద్, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ యు.మంగపతిరావు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ కె.వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఈ-పంటలో వాస్తవ సాగుదారులను నమోదు చేయాలి

ఈ- పంట నమోదులో వాస్తవ పంట సాగుదారులను నమోదు చేయాలని కలెక్టర్ నాగరాణి సంబంధిత శాఖలను ఆదేశించారు. గురువారం క లెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి రెవెన్యూ, అగ్రికల్చర్, హార్టికల్చర్, మ త్స్యశాఖల అధికారులతో ఆమె ఈ-పంట నమోదుపై సమీక్షించారు. వ్యవసా య, ఉద్యానవన పంటలకు ఈ-పంట నమోదును వచ్చేనెల 15 లోపు పూర్తి చేయాలన్నారు.

కో-ఆపరేటివ్ సంఘాలు రైతులకు సేవలు అందించాలి

కో-ఆపరేటివ్ సంఘాలు, అనుబంధ బ్యాంకులు మరింత బలోపేతం చేసి రైతులకు, ప్రజలకు మంచి సేవలు అందించాలని అధికారులను కలెక్టరు నాగరాణి ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టరేట్ వశిష్ట కాన్ఫరెన్స్ హాల్లో కో-ఆపరేటివ్, వ్యవసాయ, జిల్లా పంచాయతీ, జిల్లా పశుసంవర్థక, జిల్లా మత్స్య, డీఆర్‌డీఏ తదితర అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ జిల్లాలో 122 సహకార సంఘాలు ఉన్నాయని వీటి అన్నిటికి కంప్యూటరైజేషన్ చేయాలని, దీనిద్వారా రైతులు ఆన్‌లైన్‌లో లోను తీసుకొనుటకు, చెల్లించుటకు వెసులుబాటు కల్పించాలన్నారు.

టీడీపీ సీనియర్ నేత 'జుత్తుగ' పుట్టినరోజు వేడుకలు



శ్రీనివాసరావుకు కేక్ తినిపిస్తున్న టీడీపీ నాయకులు

ఉండి ఆగస్టు 8: టీడీపీ సీనియర్ నేత, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి జుత్తుగ శ్రీనివాసరావు పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. గురువారం ఉండి గ్రామ పార్టీ కార్యాలయం వద్ద పార్టీ నాయకుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు కరిమెరక నాగరాజు, గ్రామ అధ్యక్షుడు కాగిత బుజ్జి, ముదునూరి కృష్ణంరాజు, తోట రాము తదితరులు కేక్ తినిపించి జ్ఞాపికను అందించారు. నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు కన్నెగంటి రూత్‌కళ, మంతెన సాయిలచ్చిరాజు, కందుల బలరాం, పోలుబోతు రాము, తదితరులు పాల్గొన్నారు. ఫోన్‌లో పార్టీ జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజు, ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణరాజు శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి



జ్యోతి ప్రజ్వలన చేసి క్లాసులు ప్రారంభిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 8: విద్యార్థులు ఇష్టపడి చదివితే ఉన్నత స్థాయికి ఎదగవచ్చని వాస వి ఇంజనీరింగ్ కళాశాల అధ్యక్ష, కార్యద ర్శులు గ్రంధి సత్యనారాయణ, చలంచర్ల సుబ్బారావు అన్నారు. పెదతాడేపల్లి వాసవి ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ కోర్సు ఎంచుకున్న విద్యార్థులకు నూతన క్లాసులను వారు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఉపాధ్యక్షులు కోట్ల వెంకట రామారావు, కోశాధికారి పాబోలు వెంకటేశ్వరరావు, కోశాధికారి పేరూరి బాలకాశీయ్య, ప్రిన్సిపాల్ రత్నాకరరావు, తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన తోట సీతారామలక్ష్మి



చంద్రాబాబుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న తోట సీతారామలక్ష్మి

భీమవరం అర్బన్, ఆగస్టు 8 ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో జరిగిన పొలిట్ బ్యూరో సమావేశంలో పొలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి పాల్గొన్నారు. సమావేశంలో పార్టీ సభ్యత్వ నమోదు, వ్యక్తి గత ప్రమాద బీమా ఇన్సూరెన్స్ పెంపు, పార్టీ సంస్థాగత ఎన్నికలు, నామినేటెడ్ పదవులు, విశాఖ ఎమ్మెల్సీ అభ్యర్థిత్వంపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా చంద్రబాబును కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

రంగ భారతికి ఉద్యోగ విరమణ సత్కారం

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 8: విభిన్న ప్రతిభావంతుల కోటాలో సాంఘీక సంక్షేమ హాస్టల్స్‌లో విధులు నిర్వహించి ఇటు బాలికల ఆదరాభిమానాలతోపాటు, అధికారుల అభినందనలు పొందిన రంగ భారతి సేవలు మరువలేనివని ఏఎస్‌డబ్ల్యు టీవీఎస్‌బీఆర్ రాజు పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం యాగర్లపల్లి ఎస్సీ బాలికల సంక్షేమ హాస్టల్‌లో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేసిన వి.రంగ భారతిని అధికారులు అభినందించారు. ఉద్యోగులు, కుటుంబ సభ్యులు ఆమెను సత్కరించారు.

సంక్షిప్త సమాచారం..

- **ఆచంట, ఆగస్టు 8 :** ఇటీవల అనారోగ్యానికి గురై మరణించిన ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ సోదరుడు సూర్యనారాయణ మృతి పట్ల బీజేపీ శ్రేణులు సంతాపం ప్రకటించారు. గురువారం కొమ్ముచిక్కాలలోని పితానిని పరామర్శించారు.
- **ఆకివీడు:** కేరళ వయనాడ్ సహాయనిధికి సీపీఎం ఆధ్వర్యంలో సీపీఎం పట్టణ కార్యదర్శి కె.తవిటినాయుడు ఆధ్వర్యంలో గురువారం విరాళాలు సేకరిం చారు. బొడ్డుపల్లి రాంబాబు, బీవీ వర్మ, సందక సూరిబాబు, గౌరీనాయుడు తదితరులు ఉన్నారు.
- మొగల్తూరు : వితంతువులు, దివ్యాంగులు అర్హత ఉండి పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్నా పింఛన్ రాకుంటే న్యాయసేవా సాధికార సంస్థ ద్వారా అవసరమైన న్యాయ సహాయాన్ని ఉచితంగా అందిస్తామని అవగాహన సదస్సులో న్యాయవాది చల్లా దానయ్య నాయుడు తెలిపారు.





గొల్లలకోడేరులో ఎంపికైన సభ్యులతో టీడీపీ నాయకులు.. ఆచంట మండలం కోడేరులో ఎన్నికైన కమిటీ సభ్యులు.. కొమ్మరలో పాఠశాల యాజమాన్య కమిటీలో ఎన్నికైన అధ్యక్షులు

ప్రశాంతంగా ఎస్ఎంసీ ఎన్నికలు

జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లోని పాఠశాలల్లో స్కూలు మేనేజ్‌మెంటు కమిటీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. కొన్ని చోట్ల ఈ ఎన్నికలు సాధారణ ఎన్నికలను తలపించాయి. కొన్ని చోట్ల ఏక గ్రీవంగానూ, మరికొన్ని చోట్ల ఆయా పార్టీలు బలపరిచిన అభ్యర్థులను ఎన్నుకున్నారు. గెలిచిన వారితో ఆయా పాఠశాలల హెచ్ఎంలు ప్రమాణస్వీకారం చేయించారు.

నరసాపురం రూరల్/మొగల్తూరు, ఆగస్టు 8: పట్టణ, మండలంలో 124 ప్రభుత్వ స్కూళ్ల కమిటీ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. గురువారం ఉదయం విద్యార్థుల తల్లిదండ్రులకు కమిటీ ఎన్నికలు, మధ్యాహ్నం నుంచి ఛైర్మన్, ఉపాధ్యక్షుల ఎన్నికలు నిర్వహించారు. కొప్పర్రు హైస్కూల్ ఛైర్మన్ గిరిపై గట్టి పోటీ ఉంటుందన్న ఉద్దేశంతో ముందస్తుగా పోలీసులను రప్పించారు. అందరి ఏకాభిప్రాయంతోనే కమిటీ ఎన్నుకున్నారు. అనంతరం స్కూల్ హెచ్ఎంలు కమిటీల చేత ప్రమాణస్వీకారం చేయించారు. మొగల్తూరు మండలంలో 10 ఉన్నత పాఠశాలలు, 5 ప్రాథమికోన్నత పాఠశాలలు, 67 ప్రాథమిక స్కూళ్లకు కమిటీ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి.

- భీమవరం ఎడ్యుకేషన్ : పీఎస్ఎం గరల్స్ హైస్కూల్‌లో గురువారం జరిగిన పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలలో ఛైర్‌పర్సన్‌గా కె.విజయలక్ష్మి, వైస్ ఛైర్‌పర్సన్‌గా ఎస్.అనూష ఎన్నికైనట్టు పాఠశాల హెచ్ఎం వీఎం రాధా కృష్ణ తెలిపారు.
- ఆకివీడు/ఆకివీడు రూరల్/పాలకోడేరు/కాళ్ల/ఉండి, ఆగస్టు 8:ఆకివీడు మండలంలో 51 ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయని ఎంఈవోలు రవీంద్ర, సీతారామయ్య అన్నారు. పాలకోడేరు మండలంలోని హైస్కూల్స్, ఎలిమెంట్రీ పాఠశాలల్లో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మోగల్లు జిల్లా పరిషత్ పాఠశాలలో 24 ఓట్లు ఉండగా వైసీపీ అభ్యర్థిగా బరిలోకి దిగిన వ్యక్తిపై అదే గ్రామానికి చెందిన కె.సుబ్రహ్మణ్యం 23 ఓట్లతో విజయం సాధించాడు. టీడీపీ నాయకులు కమ్మిలి రాంబాబు, కామన రాంబాబు, సాలా మల్లేశ్వరరావు, సంకురుడు, వెంకటేష్, మొగల్లు సర్పంచ్ శ్రీనివాస్ పాల్గొన్నారు. కాళ్ల మండలంలోని 9 హైస్కూళ్లు, రెండు యూపీ స్కూల్స్, 47 ప్రైమరీ స్కూల్స్‌లో ఛైర్మన్‌లు, వైస్ ఛైర్మన్‌లతో పాటు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఉండి మండలంలోని 61 పాఠశాలల్లో ఎన్నికలు జరిగాయి. చెరుకువాడ జడ్పీ పాఠశాల ఛైర్మన్‌గా దేవిరెడ్డి శ్యామల, వైస్ ఛైర్మన్‌గా తానేటి కిశోర్‌లను ఎన్నుకున్నారు.
- ఆచంట/పెనుగొండ/పోడూరు/పెనుమంత్ర, ఆగస్టు 8 : ఆచంట మండలంలో 68 పాఠశాలలకు సంబంధించి 8 హైస్కూల్స్ , 3 యూపీ, 57 ప్రాథమిక పాఠశాలల్లో ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయని ఎంఈవోలు ఎ.ఉషారాణి, రాజేంద్రప్రసాద్ తెలిపారు. పెనుగొండ మండలంలో 62 పాఠశాలలకు సంబంధించి 7 హైస్కూల్స్ , 4 యూపీ, 51 ప్రాథమిక పాఠశాల్లో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని ఎంఈవోలు డి.సుభాకరరావు, పి.రామకృష్ణ తెలిపారు. వడలి జిల్లా పరిషత్ హైస్కూలు ఛైర్మన్‌గా శానం జయ లక్ష్మీదుర్గ, వైస్ ఛైర్మన్‌గా వెలిచేటి సూర్యనారాయణ, 22 మంది సభ్యులను ఎన్నుకున్నారు. పోడూరు మండలంలోని 8 జడ్పీ హైస్కూళ్లలోనూ, 8 యూపీ, 57 ప్రాథమిక పాఠశాలల్లో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని ఎంఈవో-1 జీవీ సూర్యనారాయణ, ఎంఈవో-2 జీవీఎస్.విజయకుమార్ తెలిపారు. పెనుమంత్ర మండలంలో ఏడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు, ఏడు యూపీ పాఠశాలలకు, ఒక రెసిడెన్షియల్ స్కూలుకు 35 ప్రాథమిక పాఠశాలకు ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని పెనుమంత్ర విద్యాశాఖ-2 ఉంగరాల నాగేశ్వరరావు తెలిపారు.
- గణపవరం, ఆగస్టు 8: గణపవరం మండలంలోని ఎంఈవో -1 పి.శేషు, ఎంఈవో-2 బాలయ్య పర్యవేక్షణలో 55 పాఠశాలల్లో విద్యా యాజమాన్య కమిటీ ఎన్నికలు నిర్వహించారు. 7 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు 7, 10 యూపీ పాఠశాలలు, 38 ప్రాథమిక పాఠశాలల్లో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయన్నారు.
- పాలకొల్లు అర్బన్, ఆగస్టు 8: పాలకొల్లు పట్టణంలో 7 మున్సిపల్ హైస్కూల్స్, 2 ఎయిడెడ్ హైస్కూల్స్, 22 ప్రాథమిక పాఠశాలలు, ఒక ఎయిడెడ్ పాఠశాల, మండలంలో 7 జడ్పీ హైస్కూల్స్, ఒక ఎయిడెడ్ హైస్కూల్, 4 ప్రాథమికోన్న పాఠశాలలు, 58 ప్రాథమిక పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి.
- పెంటపాడు, ఆగస్టు 8 : నూతనంగా నియామకమైన యాజమాన్య కమిటీలు పాఠశాల అభివృద్ధి కోసం కృషి చేయాలని ఎంఈవోలు ఎం.శ్రీనివాస్, టీవీ రామకృష్ణ అన్నారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో గురువారం నూతన యాజమాన్య కమిటీల ఎన్నిక నిర్వహించారు. పెంటపాడు ఎస్ఐ శీలం శంకర్ మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. హెచ్ఎంలు, నూతన యాజమాన్య కమిటీ సభ్యులు పాల్గొన్నారు.
- అత్తిలి, ఆగస్టు 8:అత్తిలి మండలంలోని మొత్తం పది ఉన్నత పాఠశాలల్లో 46 ప్రాథమిక పాఠశాలలకు కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని మండల విద్యాశాఖాధికారి రమేష్ తెలిపారు. ఆరవల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఆరవల్లి టీడీపీ నాయకులు వెలగల ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికలు జరిగాయి.



ఆకివీడు జడ్పీ బాలికల పాఠశాలలో యాజమాన్య కమిటీ ప్రమాణస్వీకారం

'డీఎన్నార్'లో యాంటీ డ్రగ్, టుబాకో కార్యక్రమం

భీమవరం ఎడ్యుకేషన్, ఆగస్టు 8 : విద్యార్థులు చెడు వ్యసనాలకు లోనుకాకుండా మంచి విద్యాబుద్ధులు నేర్చుకోవాలని, మీ తల్లిదండ్రులు మీ ఉజ్వల భవిష్యత్ కోసం చాలా కష్టపడుతున్నారని డీఎన్నార్ కళాశాల ప్రిన్సిపాల్ జి. మోసెస్, కళాశాల కార్యదర్శి గాదిరాజు సత్యనారాయణరాజు విద్యార్థులకు సూచించారు. డీఎన్నార్ కళాశాలలో గురువారం యాంటీ డ్రగ్ అండ్ టుబాకో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రెసిడెంట్ గోకరాజు పాండురంగరాజు మాట్లాడుతూ విద్యార్థులు వినయవిధేతలతో కలిగి విద్యపై దృష్టి పెట్టాలన్నారు. లా కళాశాల ప్రిన్సిపాల్ రఘురాం మాట్లాడుతూ పలు రకాల చట్టాలను వివరించారు. ఏవో పి.రామకృష్ణంరాజు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్స్ కె.సోమయ్య అనిల్దేవ్, రంగారావు, నోడల్ ఆఫీసర్, విద్యార్థులు పాల్గొన్నారు.

కొత్త క్రిమినల్ చట్టాలు నిలుపుదల చేయాలి

తణుకు, ఆగస్టు 8 : కొత్త క్రిమినల్ చట్టాలను నిలుపుదల చేయాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్, తణుకు బార్ అసోషియేషన్, ప్రజా సంఘాలు ఆధ్వర్యంలో, గురువారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఉభయ గోదావరి జిల్లాల ప్రధాన కార్యదర్శి కామన మునిస్వామి మాట్లాడుతూ కొత్త చట్టాలపై చర్చలు జరపకుండా చేసిన చీకటి చట్టాలన్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్, బార్ అసోషియన్ నాయకులు కొండా శ్రీనివాసరావు, షేక్ బాబ్జి, పొట్ల శ్రీను, కంకటాల శ్రీవాసు, గూడూరి సత్యనారాయణ పాల్గొన్నారు.

వేడంగిపాలెంకు ఆర్టీసీ బస్సు పునరుద్ధరణ

పోడూరు, ఆగస్టు 8 : గత ఐదేళ్ల నుంచి రద్దు చేసిన వేడంగిపాలెం ఆర్టీసీ బస్సు సర్వీసును మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశాలతో పలు గ్రామాలను కలుపుతూ ఆర్టీసీ బస్సును పునరుద్ధరించారు. వేడంగిపాలెం వచ్చిన ఆర్టీసీ బస్సును టీడీపీ మండల అధ్యక్షుడు గొట్టుముక్కల సూర్యనారాయణ రాజు ప్రారంభించారు. కొమ్ముచిక్కాల, వేడంగిపాలెం, జిన్నూరుపాలెం, వడ్లవానిపాలెం, చింతపర్రు, భగ్గేశ్వరం గ్రామాలకు ఈ బస్సు సర్వీసును నడపనున్నట్టు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మలకు ఆయా గ్రామాల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. కూటమి నాయకులు వీరగుమ్మల బుజ్జి మేడిశెట్టి బుజ్జి, కుక్కల మునేంద్రరావు, గుడాల ప్రసాదు, లంకలపల్లి ప్రసాదు పాల్గొన్నారు.

తహసీల్దార్ పోస్టింగ్‌లో కొత్త ట్విస్ట్



రాజరాజేశ్వరి

నరసాపురం, అగస్టు 8: నరసాపురం తహసీల్దార్ పోస్టింగ్ అందరిని ఆశ్చర్యానికి గురి చేసింది. రెండు రోజుల క్రితం జిల్లా అధికారులు నియామాకల్లో గురునాథరెడ్డికి పోస్టింగ్ ఇస్తున్నట్టు ఉత్తర్వులు వచ్చాయి. దీంతో ఆయన గురువారం విధుల్లో చేరతారని కార్యాలయ సిబ్బంది అంతా సిద్ధంగా ఉన్నారు. ఊహించని విధంగా రాజరాజేశ్వరి వచ్చి బాధ్యతలు చేపట్టారు. గతంలో ఆమె నరసాపురం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఏవోగా పని చేశారు. ఆమె కారు దిగగానే ఏవో మేడం వచ్చారని సిబ్బంది ఆశ్చర్యం చెందారు. ఆ తరువాత ఆమె తహసీల్దార్‌గా జాయిన్ అయ్యేందుకు వచ్చారని తెలుసుకుని అవాక్కయ్యారు. గతంలో ఆమె పోడూరు, ఇరగవరం మండలాల్లో తహసీల్దార్‌గా పని చేశారు. ప్రస్తుతం తూర్పుగోదావరి జిల్లా నుంచి బదిలీపై వచ్చారు. మంచి అధికారిణి ఆమెకు పేరొందింది. ఆమె కార్యాలయ డీటీ సీతరత్నం, డీటీ నాగదేవి, ఆర్ఐ యాశోధ, వీఆర్వోలు లక్ష్మీనారాయణ, చిరంజీవి, జయరాజు, సత్తిబాబు తదితరులు అభినందనలు తెలిపారు.

రాజాఘాట్ పండిట్ జోషికి సత్కారం

భీమవరంటౌన్, ఆగస్టు 8 :ఉత్తరప్రదేశ్ వారణాసి (కాశీ)లోని రాజా ఘాట్ పండిట్ గజానన తులసి జోషి పట్టణం వచ్చిన సందర్భంగా ఏపీ పురోహిత సంఘం ఆయనను గౌరవ ప్రదంగా కలిశారు. ఏపీ, తెలంగాణ జిల్లాల నుంచి వచ్చే పురోహితులకు వారి ద్వారా వచ్చే యజమానులకు ప్రత్యేక గుర్తింపు ఇచ్చి కాశీలో చేసుకునే పితృకార్యాలకు, దైవకార్యాలకు తగిన ఏర్పాటు వసతి ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సందర్భంగా జోషి మాట్లాడుతూ ఆంధ్ర పురోహితులకు ఎప్పుడూ సహకారం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఆయనను పురోహిత సంఘ గౌరవ అధ్యక్షుడు యామిజాల నరసింహమూర్తి, ఏపీ పురోహిత సంఘ అధ్యక్షుడు పొదిలి నారాయణమూర్తి, కార్యదర్శి వేలూరి సుబ్రహ్మణ్యం సత్కరించారు. బ్రాహ్మణ సమాఖ్య అధ్యక్షుడు వేలూరి హనుమ కిరణ్, పురోహితులు బ్రహ్మజోశ్యుల సత్యప్రసాద్ పాల్గొన్నారు.

క్విట్ ఇండియా పిలుపు మరో ఉద్యమానికి నాంది

భీమవరంటౌన్, ఆగస్టు 8 :ఆనాటి క్విట్ ఇండియా పిలుపు మరో ఉద్యమానికి మలుపు అని పలువురు వక్తలు అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో జరుగుతున్న 76వ స్వాతంత్ర్య దిన వేడుకల్లో భాగంగా క్విట్ ఇండియా స్థూపం వద్ద క్విట్ ఇండియా దినోత్సవ సభ నిర్వహించారు. తొలుత అమర వీరులకు జోహార్లు అర్పించారు. ఎస్‌టీవో అల్లూరి రవివర్మ మాట్లాడుతూ ఆనాటి స్వాతంత్ర్య ఉద్యమంలో ఒకే మాట ఒకే బాటగా ఉద్యమం సాగించారని, బ్రిటిష్ వారు భారతీయుల దేశభక్తికి ఆశర్చపోయారన్నారు. శ్రీఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ జి.మహేష్ మాట్లాడుతూ ముంబైలో మహాత్మాగాంధీ క్విట్ ఇండియా ఉద్యమానికి శంఖారావం పూరించారని, ఆ పిలుపుతో ఉద్యమం మరింత ఉధృతంగా సాగిందన్నారు. జిల్లా సర్వోదయ మండలి కార్యదర్శి ఇందుకూరి ప్రసాద్‌రాజు, స్థూప పునఃనిర్మాణ కమిటీ సభ్యులు అరసవల్లి సుబ్రహ్మణ్యం, జిల్లా పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జి. జేమ్స్ మాట్లాడారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ విద్యార్థులకు క్విట్ ఇండియా ఉద్యమ చరిత్రపై వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలను నిర్వహించామన్నారు. నరహరిశెట్టి కృష్ణ, ఏవో బోణం సురేష్ విద్యార్థులు పాల్గొన్నారు.

డాక్టర్ యల్లా ప్రగడ సుబ్బారావుకు ఘన నివాళి

పెనుమంత్ర, ఆగస్టు 8 : మార్టేరు వేణుగోపాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం డాక్టర్ యల్లాప్రగడ సుబ్బారావు వర్ధంతి నిర్వహించారు. సుబ్బారావు చిత్రపటానికి పాఠశాల హెచ్ఎం చిర్ల చినసూర్యనారాయణరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. డాక్టర్ సుబ్బారావు తన జీవితాన్ని పరిశోధనలకే అంకితం చేశారని, నేడు పలు రోగాలకు మనం వాడుతున్న అనేక ఔషధాలను ఆయనే కనుగొన్నారన్నారు. కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు దుర్గాదేవి, నర్సింహారెడ్డి విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

గణపవరం, ఆగస్టు 8: సమాజంలోని విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ ఆత్మవిశ్వాసంతో చదువుకుని ఉన్నతంగా రాణించాలని గణపవరం ఎస్ఐ వెంకటేశ్వరరావు కోరారు. గురువారం గణపవరంలోని చింతలపాటి మూర్తిరాజు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో మాదకద్రవ్యాలు, పొగాకు వ్యతిరేక అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు ప్రిన్సిపాల్ డాక్టర్ పి.నిర్మలకుమారి అధ్యక్షత వహించారు. మాదకద్రవ్యాలు ఆరోగ్యానికి కలిగే నష్టాలను, చట్టపరమైన పరిణామాలను ఎస్ఐ వెంకటేశ్వరరావు వివరించారు. అనంతరం విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. వైస్ ప్రిన్సిపాల్ మధురాజు, అధ్యాపకులు చైతన్య, శ్రీనివాసరావు, స్వరూపరాణి, వెంకట్రావు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు అమృతం



తల్లిపాల వారోత్సవంలో లయన్స్ సభ్యులు, అంగన్‌వాడీలు

తణుకు/తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 8 : తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానం అని ప్రాజెక్ట్ సూపర్‌వైజర్ అరుణకు మారి అన్నారు. ఐసీడీఎస్ ఆధ్వ ర్యంలో నిర్వహిస్తున్న మిషన్ శక్తి 100 కార్యక్రమంలో భాగంగా పైడిపర్రు, తేతలి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, బాలింతలు పాల్గొన్నారు.

- తల్లిపాలు పిల్లలకు సంజీవని అని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ క్యాంపస్ ఫార్మసి విద్యార్థులు నినాదాలు చేశారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా గురువారం పట్టణంలో విద్యార్థులు ర్యాలీ చేశారు. తల్లిపాల విశిష్టతను వివరిస్తూ ముందుకు సాగారు. హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్ , ప్రిన్సిపల్ టి అశోక్, తదితరులు పాల్గొన్నారు.

శుచి, శుభ్రతతో ఆహార పదార్థాలు అందించాలి

భీమవరంటౌన్, ఆగస్టు 8 : వీధి వ్యాపారులు తమ వద్దకు వచ్చే వినియోగదారులకు శుచి, శుభ్రతతో కూడిన ఆహార పదార్థాలను అందించాలని మునిసిపల్ కమిషనర్ ఎం.శ్యామల సూచించారు. మునిసిపాల్టీలోని కౌన్సిల్‌హాల్‌లో ఎఫ్ఎస్ఎస్ఏఐ సంస్థ, ఆహార భద్రత శాఖ, నెస్లే, మెప్మా సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు పట్టణంలోని ఆహార పదార్థాలు విక్రయించే వీధివ్యాపారులకు అవగాహన సదస్సును గురువారం ఆమె ప్రారంభించారు. ముఖ్య అతిథిగా జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ సుందర రామిరెడ్డి మాట్లాడుతూ ఆహార పదార్థాల్లో రంగులు, టేస్టింగ్ సాల్ట్ వంటివి వినియోగించవద్దు, తాము తనిఖీలు చేసినపుడు దొరికితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సదస్సులో పాల్గొన్న వ్యాపారులకు రూ.500 విలువైన నెస్లే తరపున కిట్‌ను అందించారు. శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్‌తో పాటు ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్సును ఉచితంగా అందించారు. అసిస్టెంట్ కమిషనర్ శ్రీవిద్య, నెస్లే తరపున ప్రతినిధి వసీం, నాసవీ ఎన్‌జీవో తరపున ప్రసన్న, సిటీ మిషన్ మేనేజర్ సీహెచ్ నానిబాబు, సంతోషమ్మ, జయకృష్ణ, సత్యనారాయణ, పెద్దింట్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

సోమేశ్వరస్వామి ఆలయంలో కొబ్బరి చెక్కల వేలం

భీమవరంటౌన్, ఆగస్టు 8 :గునుపూడి సోమేశ్వర జనార్దన స్వామి వార్ల దేవస్థానంలో రెండేళ్ల కాలానికి భక్తులచే సమర్పించు సగం కొబ్బరి చెక్కలు పోగు చేసుకునేందుకు గురువారం నిర్వహించిన బహిరంగ వేలం పాటలో పట్టణానికి చెందిన కొప్పర్తి మహేష్‌బాబు మొదటి ఏడాదికి 8 లక్షల 47వేలకు, రెండో ఏడాదికి 9 లక్షల 31వేల 700 రూపాయలకు పాట దక్కించుకున్నారని ఈవో రామకృష్ణంరాజు తెలిపారు. ఆలయం బయట కొబ్బరికాయలు వగైరాలు విక్రయించుకొను లైసెన్సుకు నెలకు రూ. 12 వేలుకు యర్రంశెట్టి ఆంజనేయులు పాట దక్కించుకున్నారు.

బుద్ధదేవ్ భట్టాచార్యకు ఘన నివాళి

భీమవరం అర్బన్, ఆగస్టు 8: పశ్చిమ బెంగాల్ రాష్ట్రాభివృద్ధికి మాజీ ముఖ్యమంత్రి, సీపీఎం నేత బుద్దదేవ్ భట్టాచార్య ఎనలేని కృషి చేశారని సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం అన్నారు. గురువారం సీపీఎం జిల్లా కార్యాలయంలో భట్టాచార్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఎం నాయకులు జేఎన్‌వీ గోపాలన్, ఎం.వైకుంఠరావు, ఆంజనేయులు, రత్నకుమరి పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

బాబా ఆలయంలో ప్రత్యేక పూజలు



అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు

మొగల్తూరు, ఆగస్టు 8 : స్థానిక రామాలయం వీధిలో వున్న షిరిడీ సాయి బాబా ఆల యంలో గురువారం స్వామికి భక్తులు ప్రత్యేక పూజలు, హారతి చ్చారు. భీమవరానికి చెందిన కోరసిక రఘురామ్ జ్ఞాపకార్థం వారి తనయులు ఏర్పాటు చేసిన అన్నసమారాధనలో పెద్దఎత్తున భక్తులు పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మండలంలోని రామన్నపాలెం, కేపీపాలెం, కొత్తోట, పేరుపాలెం బీచ్‌లో గల షిరిడీ సాయి ఆలయాల్లో శ్రావణమాసాన్ని పురస్కరించుకుని భక్తులు పూజలు నిర్వహించారు.

ఐశ్వర్య దుర్గాదేవికి అభిషేకాలు

అత్తిలి, ఆగస్టు 8 : రామన్నపేటలో వేంచేసి యున్న ఐశ్వర్య దుర్గాదేవి వారికి శ్రావణమాసం సందర్భంగా అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ దాసరి నాగరాజు మరియు భక్తుల సౌజన్యంతో ఘనంగా పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

15 లేసు పార్కు సొసైటీలు ఏకగ్రీవం

నరసాపురం రూరల్, ఆగస్టు 8: లేసు పార్కు పరిధిలోని 51 సొసైటీలకుగాను 15 సొసైటీలు ఏకగ్రీవమైనట్టు లేసు సిబ్బంది తెలిపారు. నరసాపురం, మొగల్తూరు, యలమంచిలి, పోడూరు, వీరవాసరం, పాలకొల్లు మండలాల్లోని మిగిలిన 36 సొసైటీల ఎన్నికలు ఈనెల 20 నాటికి పూర్తి చేస్తామన్నారు. ఈనెల 23న లేసుపార్కు కార్యాలయంలో పాలకవర్గ ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

36 మంది చాంబర్స్ విద్యార్థుల రక్తదానం



రక్తదానం చేస్తున్న చాంబర్స్ కాలేజీ విద్యార్థులు

పాలకొల్లు అర్బన్, ఆగస్టు, 8: స్థానిక ఛాంబర్స్ డిగ్రీ, పీజీ కళాశాలలో గురువారం జీఎస్‌టీ డిపార్ట్మెంట్, రెడ్ క్రాస్ సొసైటీ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో 36 మంది రక్తదానం చేశారు. రక్తదాన శిబిరాన్ని కళాశాల ఛైర్మన్ కేవీఆర్ నరసింహారావు ప్రారంభించి మాట్లాడారు. అనంతరం కళాశాల కార్యదర్శి కలిదిండి రామరాజు మాట్లాడారు. రోటరీ అధ్యక్షుడు చవాకుల నరేష్, ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ కె. రాంబాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. పోలియో డ్రాప్స్ నిమిత్తం విద్యార్థులు సేకరించిన రూ.15వేలును ఛైర్మన్ నరసింహారావు ద్వారా రోటరీ అధ్యక్షుడు చవాకుల నరేష్‌కు అందించారు.

పాలకొల్లులో డయాలసిస్ సెంటర్‌కు కృషి

పాలకొల్లు అర్బన్, ఆగస్టు 8 : మా తండ్రి యాతం సత్యనారాయణ కోరిక మేరకు పట్టణంలో వైద్య సేవలు అందిస్తున్నానని, పట్టణంలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటుకు కృషి చేస్తున్నానని శ్రీకృతి యూరాలజీ, కిడ్నీ సెంటర్ వైద్యుడు యాతం లక్ష్మీ శ్రీరంగ అన్నారు. స్థానిక చాంబర్స్ భవనంలో గురువారం పాలకొల్లులోని పీఎంపీ, ఆర్ఎంపీల సమావేశానికి ముఖ్య అతిథిగా ఆయన విచ్చేసి మాట్లాడారు. పీఎంపీ, ఆర్ఎంపీలకు సూచనలు చేశారు. విజయల్యాబ్ అధినేత కొమ్ముల మురళీ కృష్ణ, అంబటి శేషగిరి, శ్రీనివాస్, టి.రాజు, జయరాజు, ఈశ్వర్, అంబటి రాజు, మండెల అప్పలరాజు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ చేసుకోవాలి

భీమవరం క్రైం, ఆగస్టు 8 :జాతీయ లోక్ అదాలత్‌లో వచ్చే నెల 14వ తేదీన నిర్వహిస్తున్నందున ఎక్కువ సివిల్ కేసుల రాజీకి ప్రయత్నం చేయాలని భీమవరం మండల న్యాయసేవా సంస్థ ఛైర్మన్ డి.సత్యవతి అన్నారు. గురువారం జాతీయ లోక్ అదాలత్‌లో కేసుల రాజీ చేయడంపై చర్చించేందుకు స్థానిక న్యాయవాదులతో ఆమె సమావేశం నిర్వహించారు. కేసుల రాజీకి కక్షిదారులతో మాట్లాడాలని, కేసులు లోక్ అదాలత్‌లో రాజీ అయితే అంతిమ తీర్పు కాబట్టి అప్పీలు చేసుకునే అవకాశం ఉండదన్నారు. సివిల్ జడ్జి బి.అప్పలస్వామి, ప్రిన్సిపాల్ సివిల్ జడ్జి జిసురేష్‌బాబు, ఒకటో అదనపు సివిల్ జడ్జి పి.హనీషా, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యేలేటి యోహాన్ న్యాయవాదులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి : సీఐ

భీమవరం క్రైం, ఆగస్టు 8 : సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ప్రజా సంఘాల సహకారంతో ప్రణాళిక బద్ధంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని, ప్రజలు సహకరించాలని భీమవరం వన్‌టౌన్ సీఐ ఆర్.నాగరాజు అన్నారు. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో శ్రీవిజ్ఞానవేదిక రూపొందించిన ఫ్లకార్డులు, బ్యానర్లు ప్రచార కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. అపరిచితుల ఫోన్ కాల్స్‌ను రిసీవ్ చేసుకోకూడదని, ఓటీపీ నంబర్లు చెప్పకూడదన్నారు. నిర్వాహకుడు చెరుకువాడ రంగసాయి, లయన్స్‌క్లబ్ పట్టణ ఉపాధ్యక్షుడు నరహరిశెట్టి కృష్ణ మాట్లాడుతూ ప్రజలు, విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలంటూ అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్స్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల ప్రాంతాలు

కాళ్ల/పాలకోడేరు/తాడేపల్లిగూడెం రూరల్/పాలకొల్లు రూరల్/మొగల్తూరు/తణుకు, ఆగస్టు 8 : కాళ్ల మండలం ఎస్సీ బోస్ కాలనీ 33/11 విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం ఎస్సీ బోస్ కాలనీ, పల్లిపాలెం, గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పీర్ అహ్మద్‌ఖాన్ గురువారం తెలిపారు. శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కరెంట్ ఉండదన్నారు. పాలకోడేరు మండలం విద్యుత్ లైన్ల మరమ్మ తుల కారణంగా శుక్రవారం శృంగవృక్షం, బంటుమిల్లి, పెన్నాడ, కోరుకల్లు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ తెలిపారు. తాడేపల్లిగూ డెంలోని ఎఫ్‌సీఐ కాలనీ, వానపల్లిగూడెం, వీకర్స్‌కాలనీ, అబ్బులు కొట్టు సెంటర్, బాపూజి పుంతరోడ్డు, యాగర్లపల్లి కొబ్బరితోట ప్రాంతాలు, ఎన్టీయార్ నగరర్ సబ్ స్టేషన్ మరమ్మతుల నిమిత్తం టిడ్‌కో గృహాలు, కేఎస్ఎన్ కాలనీ, ఎల్.అగ్రహారం, వెంకటరామన్నగూడెం సబ్ స్టేషన్ పరిధిలోనూ ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈఈ ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు.

పాలకొల్లు పట్టణంలోని అడవిపాలెం సబ్ స్టేషన్, పట్టణంలోని ఇండోర్ స్టేషన్, ఎపి టిడ్కో సబ్ స్టేషన్ మరమ్మతుల నిమిత్తం పలు ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కరెంట్ నిలుపుతామని ఈఈ బి సురేష్‌కుమార్ తెలిపారు. మొగల్తూరు మండలంలోని కేపీ పాలెం, కొప్పర్రు, మంగళగుంటపాలెం, పంజా సెంటర్, పీఎంలంక, సీతారామపురం గ్రామాల్లో ఉదయం ఏడు నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ బి.సురేష్ కుమార్ తెలిపారు. తణుకు-పాతూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఇరగవరం కాలనీ, రెడ్డి అండ్ రెడ్డి లేఅవుట్ ఏరియా, అక్షయనగర్, శివబాలాజీ నగర్, గణేష్‌నగర్, ఇరగవరం మండల పరిధిలోని కంతేరు, కత్తవపాడు, పొదలాడ, కొత్తపాడు, అయినపర్రు, అర్జునుడుపాలెం, పెద్దిరెడ్డిపాలెం, గోటేరు. కావలిపురం, సూరంపూడి. కె.ఇల్లింద్రపర్రు గ్రామాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా నిలిపివేస్తున్నట్టు డీఈఈ రామకృష్ణ తెలిపారు.